

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- కేంద్రాలు 64, విద్యార్థులు 32,885 మంది
- ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు



పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్ఐఓ వెంకటసుబ్బయ్య

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. షెడ్యూల్ ప్రకారం మార్చి 1 నుంచి మార్చి 20 వరకు ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నారు. శనివారం మొదటి సంవత్సరం విద్యార్థులకు, సోమవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమవుతాయి. ఉదయం9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను పరీక్షకు అనుమతించరన్న నిబంధన అమల్లో ఉంది. ఇంటర్ పరీక్షల నిర్వహణకు జిల్లా ఇంటర్మీడియట్ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లా వ్యాప్తంగా 32,885 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. మొదటి సంవత్సరం 17,114, రెండవ సంవత్సరం 15,771 మంది ఉండగా.. జిల్లాలో 64 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

నిఘా నీడలో : జిల్లాలో అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పరీక్షల ప్రక్రియ మొత్తం సీసీ కెమెరాల నిఘానీడలో కొనసాగనున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు పరీక్ష కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచారు. ఇందుకోసం జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల్లో 950 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇంటర్ బోర్డుతో ఆన్‌లైన్ స్ట్రీమింగ్ చేశారు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులు పరీక్షలు ఎలా రాస్తున్నారనే విషయాన్ని అటు బోర్డు నుంచి ఇంటర్ అధికారులు, ఇటు జిల్లా అధికారులు నిరంతరం పర్యవేక్షించేందుకు వీలుగా ఆర్ఐఓ కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేసి పర్యవేక్షించనున్నారు. దీంతో పాటు జిల్లాలో 13 పరీక్ష కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. వీటిలో సిట్టింగ్ లేదా ఫ్లయింగ్ స్క్వాడ్స్ ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుంది.

కేంద్రాల వద్ద 144 సెక్షన్: అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. అలాగే పోలీసు బందోబస్తు కల్పించనున్నారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, పది సిట్టింగ్ స్క్వాడ్‌లతో పాటు డీఈసీ, స్పెషల్ ఆఫీసర్, ఆర్ఐఓ కూడా పరీక్షలను పర్యవేక్షించనున్నారు. ఈ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను పోలీసు బందోబస్తు నడుమ స్టోరేజ్ పాయింట్లలో భద్రపరిచారు.

విద్యార్థుల వివరాలు: ఇంటర్ పబ్లిక్ పరీక్షల కోసం జిల్లాలో 64 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటి సంవత్సరంలో 17,114కి గానూ బాలికలు 9309, బాలురు 7805 మంది ఉన్నారు. రెండవ సంవత్సరంలో 15,771 మంది ఉండగా బాలికలు 8542, బాలురు 7229 మంది ఉన్నారు. 64 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 64 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లతో పాటు 700 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా రక్షిత తాగునీరు, మరుగుదొడ్లు ఇతర వసతులు కల్పించారు. ప్రతి కేంద్రం వద్ద ఆరోగ్య సిబ్బంది అత్యవసర వేళల్లో ప్రాథమిక చికిత్స అందించేందుకు సిద్ధంగా ఉంటారు. కాగా సందేహాల నివృత్తికి పరీక్షలకు సంబంధించి సమస్యలు ఏమైనా ఉంటే ఆర్ఐఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 08562 244171 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చు.



ఉక్కు ఊసే లేదు

కూటమి ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉక్కు ఊసే లేకపోవడంతో జిల్లా వాసులు నిరాశ చెందారు. జగన్ ఐదేళ్ల పాలనలో జిల్లా అభివృద్ధి మరుగున పడడంతో కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అందుకు తగ్గట్లుగా సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీకి జేజేలు పలికారు. అయితే తొలిసారి ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై కొందరు నిరాశ చెందగా.. మరి కొందరు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా జిల్లాకు గుండెకాయలాంటి ఉక్కు ఫ్యాక్టరీకి నిధులు కేటాయించకపోవడంపై విమర్శలకు తావిస్తోంది.

- జిల్లా ప్రజల నిరాశ
- ప్రాజెక్టులకు నిధులు అంతంత మాత్రమే
- తల్లికి వందనం, అన్నదాత సుఖీభవకు నిధుల కేటాయింపుపై హర్షం



కడప, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో 2025-26 బడ్జెట్‌ను శుక్రవారం ప్రవేశపెట్టారు. జిల్లాకు సంబంధించి నీటిపారుదల, పారిశ్రామిక, సేవలు, ఇతర రంగాలకు రూ.4485 కోట్లకు పైగా నిధులను కేటాయించారు. ప్రాజెక్టుల వారీగా పరిశీలిస్తే జిల్లాలోని ప్రాజెక్టులకు రూ.850 కోట్లు కేటాయించగా, ఈ ప్రాజెక్టులన్నీ రాయలసీమ జిల్లాకు ముడిపడి ఉన్నాయి. వీటిలో హెచ్ఎన్ఎస్ఎస్ రూ.3,263 కోట్లు, జీఎన్ఎస్ఎస్‌కు రూ.488కోట్లు, కేసీ కెనాల్‌కు రూ.150.3 కోట్లు, తెలుగుగంగకు రూ.145కోట్లు, వీబీసీకి రూ.120కోట్లు, వెలిగల్లుకు రూ.5కోట్లు, ఎల్ఎస్‌పీకి రూ.20కోట్లు, మైలవరానికి రూ.35 లక్షలు కేటాయించారు. అయితే జిల్లాకు గుండెకాయలాంటి ఉక్కు ఫ్యాక్టరీపై అసెంబ్లీ సాక్షిగా ఎలాంటి ప్రకటనలు చేయకపోవడంపై విమర్శలకు తావిస్తోంది. ఇక సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఇతర పథకాలకు నిధులు కేటాయించడంతో సామాన్యుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఇప్పటి దాకా, వైసీపీ, కాంగ్రెస్, వామపక్షాలు తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ ఎక్కడ అంటూ ప్రశ్నించేవారు. ఇప్పుడు నిధుల కేటాయింపులతో త్వరలోనే లబ్ధి జరగనుంది.

బడ్జెట్ నిరాశపరిచింది

- విజయజ్యోతి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు



రాష్ట్ర బడ్జెట్ తీవ్ర నిరాశకు గురిచేసింది. మధ్యతరగతి ఆశలను అడియాశలు చేసింది. రైతులకు ఎలాంటి ప్రోత్సాహాలు లేవు. పెట్రోల్, డీజిల్ తగ్గించేలా సుంకాలను తగ్గించలేదు. నిత్యావసర వస్తువుల ధరలపై దృష్టి పెట్టలేదు. ఈ బడ్జెట్‌ను పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం.

బడ్జెట్ భళా...

- వెంకటసుబ్బారెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు



మోదీ ఆశయసాధనకు అనుగుణంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టింది. పేదల కోసం 7లక్షల ఇళ్లు, జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టుకు రూ.67.05 కోట్లు, ఆరోగ్యం ఇలా ఎన్నో పథకాలను అమలు చేస్తూ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

ఇది రైతు సంక్షేమ బడ్జెట్

- పుత్తా నరసింహారెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు



మా ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు అనుకూల బడ్జెట్. సాగునీటి ప్రాజెక్టులతో పాటు, సూపర్‌సిక్స్ పథకాలతో పాటు రైతులకు అండగా నిలబడి, పేద పిల్లల కోసం తల్లికి వందనం, బీసీ సంక్షేమం నిధులు కేటాయింపులు చేశారు. ఇది అన్ని వర్గాలకు ఉపయోగపడే బడ్జెట్.

బడ్జెట్ కేటాయింపుల్లో మోసం

- గాలి చంద్ర, సీపీఐ నాయకుడు

కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపుల్లో జిల్లాకు అన్యాయం చేసింది. కడప జిల్లాకు సంబంధించి ఉక్కుఫ్యాక్టరీ లేదు. ఇదే ప్రభుత్వం ఉక్కు ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేసి వాటిని మరిచింది. కరువు పీడిత జిల్లాల్లో హంద్రీనీవా, గాలేరునగరి, కనీసం పదిశాతం నిధులు కేటాయించలేదు. కొన్ని వాటిని పట్టించుకోకపోవడం విచారకరం.

ఎన్నికల హామీలను వదిలేశారు

- రవీంద్రనాథ్‌రెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు



ఎన్నికల్లో గెలిచేందుకు చంద్రబాబునాయుడుతో అలివికాని హామీలిచ్చారు. అయితే పూర్తిస్థాయి బడ్జెట్‌లో వాటికి పంగనామం పెట్టారు. మహిళాశక్తి, నిరుద్యోగభృతి, ఉచిత బస్సుకు పైసా ఖర్చులేదు. తల్లికి వందనం, దీపం అన్నదాత, సుఖీభవ పథకాలలో కోతపెట్టింది. నిరుద్యోగ భృతి గురించి ప్రస్తావించకుండా వారిని మోసం చేసింది.

ఉద్యానపంటల ఎగుమతిని పెంచాలి

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) జిల్లాలో పారిశ్రామిక ఉద్యాన పంటలను ఉత్పత్తి చేసి ఎగుమతుల సామర్థ్యాన్ని పెంచేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్థిక ప్రగతికి ఆయువు పట్టులాంటి పారిశ్రామికరంగాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని సూచించారు.కొప్పర్తి పారిశ్రామిక వాడలో మౌలిక వసతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారిశ్రామికవేత్తలకు సహాయ సహకారాలు అందించాలన్నారు. పారిశ్రామిక అభివృద్ధి పాలసీ (ఐ.డి.పి) 2023-27 ద్వారా ఎస్సీ, ఎస్టీ కేటగిరీకి 5 ట్రాన్స్‌పోర్టు వాహనాలకు సంబంధించి పెట్టుబడి రాయితీల కింద రూ.75.98 లక్షల మంజూరుకు కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. మొత్తంగా 8 యూనిట్లకు సంబంధించి రూ.1.29 కోట్ల రాయితీల మంజూరుకు కమిటీ ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలశాఖ జనరల్ మేనేజరు సంబంధిత వివరాలను కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం చాంద్‌బాషా, ఏపీఐఐసీ జెడ్ఎం శ్రీనివాసమూర్తి, నగర కమిషనరు మనోజ్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల ఆర్థికాభివృద్ధికి సహకరించాలి

జిల్లాలో సహకార సంఘాలను బలోపేతం చేసి స్వయం సహాయక సంఘాల ఆర్థికాభివృద్ధికి సహకరించాలని కలెక్టర్ శ్రీధర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంఘాలను అన్ని విధాల ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి సురేష్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్, వ్యవసాయశాఖ జేడీ నాగేశ్వరరావు, డీపీఓ రాజ్యలక్ష్మి, పంచాయతీ రాజ్ ఎస్ఈ శ్రీనివాసులరెడ్డి, డీసీసీబీ సీఈవో రాజమణి, నాబార్డు డీడీఎం, మార్కుఫెడ్, మెప్మా తదితర అధికారులు పాల్గొన్నారు.

సైన్స్ అభివృద్ధితోనే దేశాభివృద్ధి : డీఈఓ



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న డీఈఓ

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సైన్స్ అభివృద్ధితోనే దేశాభివృద్ధి ఆధారపడి ఉంటుందని డీఈఓ డాక్టర్ షంషుద్దీన్ అన్నారు. శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ శాస్త్ర సాంకేతిక మండలి (ఆప్ కాస్ట్) ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మెయిన్‌లో సైన్స్ ఎగ్జిబిషన్, సైన్స్‌లో వివిధ రకాల పోటీలను నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్ సీవీ రామన్ జ్ఞాపకార్థం భారతదేశంలో ప్రతి ఏడాది ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకుంటారన్నారు. విద్యార్థి దశ నుంచే పరిశోధనలను ప్రోత్సహించినట్లయితే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, సైన్స్ ఉపాధ్యాయులు ఎస్.అబ్దుల్ సత్తార్, వై.లక్ష్మీమంజుల జిల్లా సైన్స్ మ్యూజియం క్యూరేటర్ రెహమాన్, జిల్లా అకడమిక్ సమన్వయకర్త ఆర్.శ్రీనివాసులరెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు దామోదర్, వై.శ్రీధర్‌రావు, పి.వరప్రసాద్ పాల్గొన్నారు.

ఏఐ కేంద్రాల్లో ఓపెన్ ఇంటర్ హాల్‌టికెట్లు

ఓపెన్ స్కూల్ ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి హాల్‌టికెట్లు ఏఐ కేంద్రాల్లో తీసుకోవాలని డీఈఓ షంషుద్దీన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యాసకులు హాల్ టికెట్లకు సంబంధించి ఏఐ సెంటర్స్, ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని ప్రింట్ తీసుకొని ఏఐ సమన్వయకర్త సీల్, సంతకం చేయించుకొని పరీక్షకు హాజరుకావాలని సూచించారు.

లంకమలలో లేబుల్ శాసనాలు

- అడుగడుగునా శైవమత ఆనవాళ్లు..
- బండలు, రాళ్లపై చిత్రాలే ఆధారాలు
- దక్షిణ భారతదేశంలో మొదటి లేబుల్ శాసనాలు
- పురావస్తు శాఖ డైరెక్టర్ మునిరత్నం బృందం పరిశీలనలో వెల్లడి

రాయచోటి/సిద్దవటం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు బాహ్య ప్రపంచానికి తెలిసిన లంకమల అభయారణ్యం అంటే.. దట్టమైన అడవి.. అందమైన పక్షులు, క్రూర జంతువులు, నిత్యపూజకోన. గోపాలస్వామికోన వరకే.. అయితే ఆ లంకమల అభయారణ్యం శైవమతానికి పెట్టని కోట అనడానికి ఆనవాళ్లు అడుగడుగునా కనిపిస్తాయి. లంకమలలో అనేకచోట్ల బండరాళ్లపై క్రీ.శ.4-10 శతాబ్దపు మధ్య కాలంలో మానవులు బండరాళ్లపై చెక్కిన శాసనాలు (లేబుల్ శాసనాలు) కనిపిస్తాయి. దక్షిణ భారతదేశంలోనే ఇవి మొదటగా ఇక్కడే బయటపడడం విశేషం. ఇలా సిద్దవటంలోని లంకమలలో లక్షల సంవత్సరాల చరిత్ర బయటకు రావడానికి కడప జిల్లా సిద్దవటం ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ కళావతి కారణమైతే.. పురావస్తుశాఖ డైరెక్టర్ మునిరత్నంరెడ్డి వాటిని సేకరించి.. ఏ రాళ్లలో ఏ చరిత్ర దాగుందో..? తేల్చే పనిలో ఉన్నారు. రెండు రోజుల పాటు బెంగళూరు, చెన్నైలకు చెందిన పురావస్తు కేంద్రాల నుంచి వచ్చిన పురావస్తు శాఖ డైరెక్టర్ మునిరత్నంరెడ్డి బృంద సభ్యులు యేసుబాబు, వి.రాఘవేంద్ర వర్మ, సిద్దవటం అటవీ రేంజ్ ఆఫీసర్ కళావతి.. తదితరులు గురు, శుక్రవారాలు లంకమల ప్రాంతంలో పర్యటించి.. శాసనాలను సేకరించారు. సిద్దమాతృక, శంఖులిపి, దేవనాగరి లిపిలో ఉన్న ఉత్తర భారత యాత్రికులు ఇక్కడికి వచ్చి బండ రాళ్లపై చెక్కిన శాసనాలను గుర్తించారు. సుమారు 2200 అడుగులకు పైగా ఎత్తయిన కొండలపైన యాత్రికులు చెక్కిన శాసనాలను గుర్తించారు.



శాసనాలను పరిశీలిస్తున్న పురావస్తు శాఖాధికారులు



రాయిపై పాదం చెక్కిన దృశ్యం

శిథిలమైన విగ్రహం

ఎలా బయటకు వచ్చాయి?

గత ఏడాది డిసెంబరులో సిద్దవటం అటవీ రేంజ్ అధికారిణి కె.కళావతి సాధారణ తనిఖీలో భాగంగా లంకమల అభయారణ్యంలోకి వెళ్లారు. నిత్యపూజకోన దాటుకుని సుమారు 700 మీటర్ల దూరంలో ఒక పెద్ద బండరాయిపైన శాసనాలు చెక్కి ఉన్నట్లు ఆమె గుర్తించారు. వీటిని ఫొటోలు తీసి భారత పురావస్తు శాఖ డైరెక్టర్ మునిరత్నంరెడ్డికి పంపగా వాటిని చూసిన ఆయన వీటిపై పరిశోధనలు జరపడానికి ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకుని ఇక్కడికి వచ్చి సర్వే చేశారు.

సర్వేలో ఏం బయటపడ్డాయి.?

గోపాలకోన ప్రాంతంలో గురువారం కణతిగుండంను పరిశీలించారు. అక్కడ 12 శాసనాలు సేకరించారు. అదే ప్రాంతంలో వంకమీద పెద్ద బండరాయి పైన ఉన్న శాసనాన్ని సేకరించారు. ఈ శాసనంలో ఏముందో? పురావస్తు శాఖ అధికారులు తేల్చాల్సి ఉంది. శుక్రవారం నిత్యపూజకోన ప్రాంతంలో 15 శాసనాలు సేకరించారు. ఇక్కడ ఒక్కో రాయిపైన ఒక్కో శాసనం ఉంది. ఎన్నిరాళ్లపైన శాసనాలు ఉన్నా.. అవన్నీ.. ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా వేర్వేరుగా ఉన్నాయి. రెండు రోజులు కలిపి 27 శాసనాలను సేకరించారు. 4వ శతాబ్దం నుంచి 10వ శతాబ్దం మధ్యలో నిత్యపూజ కోన నుంచి గోపాలకోనకు వస్తూ ఈ శాసనాలు చెక్కి ఉండవచ్చు ఇవి పేర్లు అయి ఉండవచ్చు... లేదా ఏవైనా బిరుదులు అయి కూడా ఉండవచ్చు లేదా దేవుళ్ల పేర్లు అయి ఉండవచ్చు అని పురావస్తు శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. అదే విధంగా ఈ అటవీ ప్రాంతంలో అనేక శివాలయాలు ఉన్నాయి. కపర్తీశ్వర కోన వద్ద ఉన్న శివాలయం ఎంతో పురాతనమైనది. కైలాసకోన ప్రాంతంలో ఎక్కువ శివాలయాలు ఉన్నాయి. వీటిని పరిశీలిస్తే లంకమల ఒకప్పుడు శైవమతానికి ముఖ్యమైన ప్రాంతంగా ఉండేదని చెప్పవచ్చు. అయితే గోపాలకోనలో మాత్రమే కృష్ణుడి దేవాలయం ఉంది. ఇక్కడ దాదాపు అప్పట్లో నరసింహ స్వామి గుడి ఉన్నట్లు తెలుస్తోంది. దీనిని బట్టి ఇక్కడ వైష్ణవ మతం ఆనవాళ్లు కూడా కనిపిస్తున్నాయి.

140 సంవత్సరాల్లో మొదటిసారి అడవిలో శాసనాల సేకరణ



ఇప్పటి వరకు దేశంలో ఎక్కడా అభయారణ్యాలలో లేబుల్ శాసనాలను గుర్తించలేదు. మొదటిసారిగా లంకమల అడవిలో గుర్తించి సేకరించాము. ఈ శాసనాలన్నీ సంస్కృతం, ప్రాకుర్తా భాషలో ఉన్న శాసనాలు.. లిపి బ్రాహ్మి, సెల్ క్యారెక్టర్స్, నాగరి క్యారెక్టర్స్ ఉన్న శాసనాలు. ఇవి క్రీ.శ.4 నుంచి 11వ శతాబ్దం వరకు ఉన్న శాసనాలుగా ఉన్నాయి. ఇవన్నీ ఆ రోజుల్లో భక్తులు ఈ ప్రాంతంలో ఉన్నందుకు గుర్తుగా వేయించిన శాసనాలు కావచ్చు. నిత్యపూజకోన, గోపాలకోనకు లింకు ఉన్నట్లు ఈరోజు మేము సేకరించిన శాసనాల ద్వారా తెలిసింది. ఈ శాసనాలను కనుగొనడం వల్ల ఎప్పటి నుంచో లంకమల అడవుల్లో ఆదిమానవుడు సంచరించాడని, మనుగడ ఉండేదని తెలుస్తోంది. అదేవిధంగా ఆ రోజుల్లో ఈ ప్రాంతంలో శైవమతం ఎంత వర్ధిల్లింది అనేది తెలుస్తుంది. ఈ లిపి ద్వారా ఆ రోజుల్లో రాజులు ఎలా పరిపాలన చేశారో తెలుస్తుంది. ఎంత కష్టపడి పనిచేశారో కూడా తెలుస్తుంది. ఉత్తర భారతదేశం నుంచి భక్తులు ఇక్కడికి వచ్చి వాళ్ల షెల్ క్యారెక్టర్స్‌తో రాయించారో తెలుస్తుంది. డైరెక్టర్ ఆఫ్ ఆర్కియాలజీ ఇండియా నుంచి ఎక్కడ శాసనాలు ఉన్నా.. వాటిని సేకరించడం మా పని.. ఇక్కడ అడవిలో ఉన్నాయని తెలియడంతో అధ్యయనం చేయడానికి వచ్చాము. ఇప్పటి వరకు రాయలసీమలో ఇటువంటివి దొరకలేదు. మొదటిసారి కాబట్టి పరిశోధించడానికి వచ్చాము. ఎపిగ్రాఫికల్ తరపున మొట్టమొదటిసారి ఒక అడవిలో సర్వే చేసి శాసనాలను సేకరించడం 140 సంవత్సరాల నుంచి ఇదే మొదటిసారి. గతంలో ఇక్కడ దేవాలయాలు ఉండి శిథిలమైనట్లు తెలుస్తోంది. ఇక్కడ 6వ శతాబ్దపు ఆలయాలు ఉన్నాయి.

- మునిరత్నం రెడ్డి, పురావస్తు శాఖ డైరెక్టర్

కూంబింగ్ చేస్తుండగా బయట పడ్డాయి.



గత డిసెంబరులో నిత్యపూజకోన నుంచి గోపాలకోనకు కూంబింగ్‌కు వెళుతుండగా మొదటిసారి బండరాళ్లపై శాసనాలను చెక్కి ఉండడాన్ని గమనించాను. నిత్యపూజకోన దాటిన తర్వాత అక్కదేవతలకోన నుంచి సుమారు 700 మీటర్ల దూరంలో కొండ ఎక్కుతుండగా అక్కడ ఉన్న ప్రతి రాయికి ఏదో ఒకటి చెక్కడం గుర్తించాను. ఫొటోలు తీసుకున్నాను. అక్కడి నుంచి గోపాలకోన దారిలో ఒక పెద్ద బండ మీద అనేక రకాలుగా శాసనాలు చెక్కి ఉన్నారు. ఆ ఫొటోలను ఆర్కియాలజీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ మునిరత్నంరెడ్డికి పంపించాము. ఆయన అటవీ శాఖ నుంచి అనుమతి తీసుకుని వచ్చి సర్వే నిర్వహించారు.

- కె.కళావతి, రేంజ్ ఆఫీసర్ సిద్దవటం

ఎమ్మెల్యే ఆకేపాటి అక్రమ రిజిస్ట్రేషన్లన్నీ రద్దు

● 39.58 ఎకరాల ప్రభుత్వ భూమి

రాయచోటి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తన ఎస్టేట్ పేరిట ప్రభుత్వ భూముల్లో చేసుకున్న అక్రమ రిజిస్ట్రేషన్లను శుక్రవారం రాజంపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రద్దు చేసినట్లు తెలిసింది. ఎమ్మెల్యే తన స్వగ్రామ సమీపంలో ఆయన పేరిట, ఆయన కుటుంబం పేరిట సుమారు 39.58 ఎకరాల ప్రభుత్వ భూమిలో అక్రమ రిజిస్ట్రేషన్‌లు చేసుకున్న విషయం విదితమే. దీనిపై ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదులు చేయడంతో కలెక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో విచారణ చేసి ఆకేపాడు సమీపంలో ఎమ్మెల్యే ఆకేపాటి ఎస్టేట్ పేరిట నిర్మించిన నివాస గృహం, వ్యాపార సముదాయాలు ఇతర నిర్మాణాలన్నీ ప్రభుత్వ భూముల్లో నిర్మించినవని, ఇవన్నీ అక్రమ రిజిస్ట్రేషన్లు అని నిర్ధారించి ఈ మేరకు ఆ భూములను ఆన్‌లైన్‌లో వారి పేరిట రద్దు చేసి అవి ప్రభుత్వ భూములుగా మార్చి వేశారు. ఈ భూములకు సంబంధించిన అక్రమ రిజిస్ట్రేషన్లను శుక్రవారం రాజంపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రద్దు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఆయన సతీమణి ఆకేపాటి జ్యోతమ్మ, ఆయన సోదరుడు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి సతీమణి సుగుణ పేరిట ఈ అక్రమ రిజిస్ట్రేషన్లు 2023 మే 15వ తేదీ రాత్రివేళ గుట్టుచప్పుడు కాకుండా చేశారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఈ అక్రమ రిజిస్ట్రేషన్లకు అప్పటి రిజిస్ట్రేషన్ అధికారులు సహకరించి ఈ రిజిస్ట్రేషన్‌లు చేశారు. వాటన్నింటిని ఆన్‌లైన్‌లో నుంచి తొలగించి శుక్రవారం ఆ రిజిస్ట్రేషన్‌లు కూడా రద్దు చేయడం సంచలనాత్మకంగా మారింది. ప్రభుత్వ భూమిలో ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి నిర్మించిన అక్రమ కట్టడాలను ఏమి చేస్తారోనన్నది ఆసక్తిగా మారింది.


ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ఎస్టేట్ భూములు


హత్యరాల పురవీధుల్లో త్రేతేశ్వరస్వామి రథోత్సవం

రథంపై భోళాశంకరుడి వైభోగం



● భారీ ఎత్తున పాల్గొన్న భక్తజనం

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన హత్యరాల కామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం స్వామివారు రథంపై పురవీధుల్లో ఊరేగారు. భక్తుల కోరిన కోర్కెలు తీర్చే భోళాశంకరుడి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. హత్యరాల శివనామస్మరణతో మార్మోగింది. స్వామివారిని దర్శించుకునేందుకు రాజంపేట, పెనగలూరు, నందలూరు, పుల్లంపేట, చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీఎత్తున తరలివచ్చారు. రథంపై కొలువుదీరిన త్రేతేశ్వరస్వామిని కనులారా వీక్షించి మొక్కులు తీర్చుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పోలీసులపై పేకాటరాయుళ్ల దౌర్జన్యం

● 12 మందిపై కేసు నమోదు ● ఆరుగురు అరెస్టు

పీలేరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పేకాట ఆడడమే కాకుండా దానిని అడ్డుకున్న పోలీసులపై దౌర్జన్యం చేసిన 12 మందిపై కేసు నమోదు చేసినట్లు పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ శుక్రవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. 26వ తేదీన రాత్రి 11 గంటలకు అగ్రహారం పంచాయతీ దేశిరెడ్డిగారిపల్లె శివాలయం సమీప మామిడి తోటలో పేకాడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ బాలకృష్ణ, ఏఎస్ఐ ఉమర్ అలీ, హెడ్ కానిస్టేబుల్ ఆదినారాయణ, కానిస్టేబుళ్లు ఆనంద్, సతీశ్‌తో కలిసి అక్కడికి వెళ్లారన్నారు. అక్కడ జాజం సుబ్బారావు, భానుప్రకాశ్, ఎస్.సురేంద్ర, వై.రమేశ్ రెడ్డి, ఎస్.రాజారావు, ఎం.మణికంఠేశ్వరరెడ్డి, ఎస్.పండుసారధి, జి.బాబు, ఎం.మన్మోహన్, ఎం.జనార్దన్, రమణ, సుబ్బయ్య, మరికొందరు పేకాట ఆడుతున్నారని, వారి వద్ద ఉన్న 1,70,000 నగదు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. మిగిలినవారి కోసం విచారిస్తుండగా జాజం సుబ్బారావు, అతని కుమారుడు భానుప్రకాశ్, సురేంద్ర పోలీసులపై దాడికి యత్నించారన్నారు. అంతేకాక ఎస్ఐ బాలకృష్ణపై రాళ్లు, కర్రలతో దాడి చేయాలని ఇతరులను కూడా ప్రేరేపించాడన్నారు. దీంతో పోలీసులు ప్రాణభయంతో అక్కడి నుంచి తప్పించుకున్నారని, విషయం తనకు తెలియడంతో సిబ్బందితో హుటాహుటిన వెళ్లి అక్కడే ఉన్న వారందరినీ అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. కేసు నమోదు చేసిన వారిలో సుబ్బారావు, భానుప్రకాశ్, సురేంద్ర, సోమా నాయక్, రమేశ్ రెడ్డి, మన్మోహన్ రెడ్డిని శుక్రవారం రిమాండుకు తరలించినట్లు వివరించారు.

రెవెన్యూ అధికారులపై దాడి కేసులో ప్రధాన నిందితుడి అరెస్టు : డీఎస్పీ

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులపై దాడి చేసిన ఘటనలో ప్రధాన నిందితుడు అంబటి చలపతిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కిందామ్రిపల్లె పంచాయతీ దేవతానగర్ సర్వేనెంబర్ 1029 ప్రభుత్వ భూమిలో కొందరు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారన్న సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు బుధవారం ఉదయం ఆక్రమణలను తొగించేందుకు ఉపక్రమించారని, ఆ సమయంలో స్థానిక శివాజీనగర్ వాసి అంబటి చలపతి, చంద్రాకాలనీకి చెందిన ప్రదీప్, రమణయ్య రెవెన్యూ అధికారులను దుర్భాషలాడి మారణాయుధాలతో హత్య చేయడానికి ప్రయత్నించారన్నారు. అంతేకాకుండా ఎక్స్‌కవేటర్ అద్దాలను ధ్వంసం చేసి, డ్రైవర్ రెడ్డెప్పపై, ఎక్స్‌కవేటర్‌పై పెట్రోల్ పోసి తగలపెట్టే ప్రయత్నం చేశారన్నారు. ఇందులో అంబటి చలపతి, ప్రదీప్, అతని తండ్రి రమణయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా అంబటి చలపతిని శుక్రవారం మదనపల్లె- తిరుపతి జాతీయ రహదారి తట్టివారిపల్లె నాలుగు రోడ్ల సర్కిల్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్నారు. నిందితుడి నుంచి ఒక కొడవలి, ఖాళీ పెట్రోలు క్యాను, రెండు కట్టెలు స్వాధీనం చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో తాలుకా సీఐ కళా వెంకటరమణ, రూరల్ సీఐ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలిపై పోలీసులకు ఫిర్యాదు

వాల్మీకిపురం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): తరిగొండ రోడ్డులోని ఏపీ మైనార్టీ బాలికల గురుకుల ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న హిందీ ఉపాధ్యాయురాలిపై పాఠశాల చైర్మన్ ఆయేషా, విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం సీఐ ప్రసాద్‌బాబుకు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో బాలికలు గొడవ పడ్డారని, ఆ విషయంపై విద్యార్థినులను వారించాల్సిందిపోయి ఉపాధ్యాయురాలు వారిని పిలిపించి ఖురాన్‌పై ప్రమాణం చేయాలని బలవంతం చేసిందన్నారు. అంతేకాక ఓ బాలిక తన వ్యక్తిగత కారణం చేత ప్రమాణం చేయనని చెబితే వినకుండా ఖురాన్ కూడా ఒక పుస్తకమేనని, ప్రమాణం చేయడం ఇబ్బంది కాదని మాట్లాడిందని వాపోయారు. కొంత కాలంగా పాఠశాలలో ఏదో ఒక సంఘటన జరుగుతూనే వస్తోందని, మత విశ్వాసం దెబ్బతినేలా మాట్లాడడం బాధాకరమన్నారు. దీనిపై విచారణ జరిపి భవిష్యత్తులో విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

తల్లిదండ్రులు మందలించారని పురుగుల మందు తాగి బాలిక మృతి

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): బడికి వెళ్లాలని తల్లిదండ్రులు మందలించినందుకు బాలిక పురుగుల మందు తాగి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. శుక్రవారం రైల్వేకోడూరు మండలంలోని ఎస్.కొత్తపల్లెకు చెందిన నాగరాజు తోటకు శ్రీనువాసులు, వెంకటమ్మలు కొంతకాలంగా కాపలా ఉంటున్నారు. వీరి కుమార్తె తుపాకుల వెంకటమ్మ ఏడో తరగతి చదువుతోంది. బడికి వెళ్లలేదని తల్లిదండ్రులు మందిలించినందుకు తోటలో ఉన్న పురుగుల మందును ఈనెల 24వ తేదీన తాగింది. హుటాహుటిన తిరుపతిలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ పుష్ప తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

రాజంపేటలో ఐదు ఇళ్లల్లో దొంగల బీభత్సం

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నూనెవారిపల్లె రోడ్డు అక్షర స్కూలు సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ఐదు ఇళ్లల్లో దొంగలు బీభత్సం చేశారు. శుక్రవారం తెల్లవారుజామున 1.30 నుంచి 3 గంటల మధ్య మాస్కులు ధరించి ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డారు. బాధితులంతా కుంభమేళాకు వెళ్లడంతో ఇదే అదునుగా దొంగతనానికి పాల్పడ్డారు. మేడా సుబ్బారెడ్డి, రమణారెడ్డి, కార్తీక్, శ్రీనివాసుల నాయుడు ఇళ్లతో పాటు మరో ఇంటిలోకి వీరు మాస్కులు ధరించి ప్రవేశించారు. మేడా సుబ్బారెడ్డి ఇంటి మెయిన్‌డోర్‌ను పగులగొట్టి బెడ్ రూంలోకి ప్రవేశించి 80 వేల నగదు, కొంత బంగారాన్ని అపహరించారు. అయితే మిగిలినవారి ఇళ్లల్లోకి ప్రవేశించినా వారి ఇళ్లల్లో కొందరు కుటుంబసభ్యులు ఉండడంతో దుండగులు వెనుదిరిగారు. విషయం తెలుసుకున్న పట్టణ ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి సంఘటనపై విచారణ చేశారు. ఆ ప్రాంతంలోని సీసీ పుటేజీలను పరిశీలలించారు. ఇద్దరు మాస్కులు ధరించి స్కూటర్‌లో రెక్కీ నిర్వహించి, మిగిలినవారు ఇళ్ల వెనుకవైపు నుంచి ప్రవేశించినట్లు గుర్తించారు. ఈ మేరుకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


బెడ్‌రూంలోని వస్తువులను చెల్లాచెదురు చేసిన దొంగలు

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ... హాజరైన విద్యార్థులు, తదితరులు





ఏకాగ్రత ఉంటే చదువులో రాణించగలరు

● పిల్లలు సెల్‌ఫోన్ కు దూరంగా ఉంటే ఏదైనా సాధించ వచ్చు ● సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఏకాగ్రత ఉంటే చదువులో రాణించగలరని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ తెలిపారు. రైల్వేకోడూరు విజయా కన్వెన్షన్ లో అపుస్మా ఆధ్వర్యంలో శుక్రవారం పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా విద్యార్థునులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సీబీఐ మాజీ జేడీ మాట్లాడుతూ పిల్లల్లో ఉన్న సృజనాత్మకమైన విషయాలను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు కూడా పాటుపడాలన్నారు. శ్రీనివాసరామానుజం చిన్న వయస్సులోనే తన తెలివితేటలను ప్రదర్శించారన్నారని గుర్తు చేశారు. ప్రశ్నపత్రాలు విద్యార్థులను చూసి భయపడాలే గాని ప్రశ్నపత్రాలను చూసి విద్యార్థులు భయపడకూడదన్నారు. పరీక్షల సమయంలో సెల్‌ఫోన్ పక్కన పెట్టాలన్నారు. పిల్లలకు సినిమా డైలాగులు గుర్తుంటాయని, చదువుపై శ్రద్ధ పెడితే ఉన్నతమైన స్థానాలకు చేరుకోవచ్చునని తెలిపారు. బాగా పఠనం చేసి పరీక్షలు రాయాలని, రైల్వేకోడూరు పేరు నిలబెట్టాలన్నారు. షటిల్ బాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు వివాహానికి తాను వెళ్లాలని తెలిపారు. ఒలంపిక్స్‌లో రెండుసార్లు ఇండియాకు బహుమతులు ఎలా సాధించారని పీవీ సింధును అడిగానని, ఇందుకు ఆమె తాను నాలుగు నెలల పాటు సెల్‌ఫోన్ పట్టుకోకుండా లాకర్ వేసి, తనకు ఇష్టమైన ఐస్‌క్రీంను వదులుకుని ఏకాగ్రతతో సాధన చేశానని తెలిపిందన్నారు. అమ్మ చేతికి కత్తి ఇస్తే కూరగాయలు కోస్తుందని, అదే కత్తి వైద్యుడికి ఇస్తే సర్జరీ చేస్తారని, క్రిమినల్ చేతికి ఇస్తే చంపుతాడని అభివర్ణించారు. అబ్దుల్ కలాం తన తండ్రి బోటును తయారు చేస్తుండగా చూసి భారతదేశానికి మిసైల్స్ తయారు చేశారని గుర్తు చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఏకాగ్రతతో చదివి పరీక్షలు రాయాలని కోరారు. కార్యక్రమంలో ప్రైవేటు యాజమాన్యాలు, తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మించకుంటే.. హంద్రీ-నీవా పనులు జరగనివ్వం

● హంద్రీ-నీవా కాల్వలో ఎండ్లపల్లె గ్రామస్థుల నిరసన

ములకలచెరువు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా కాలువ మీదుగా తమ పొలాలకు వెళ్లేందుకు వంతెన నిర్మించాలని, లేకుంటే కాంక్రీట్ లైనింగ్ పనులను అడ్డుకుంటామని ఎండ్లపల్లె గ్రామస్థులు తేల్చి చెప్పారు. ఈ మేరకు వారు హంద్రీ-నీవా కాలువలోకి దిగి నిరసన తెలిపారు. ఆ వివరాల్లోకి వెళితే.. ములకలచెరువు మండలం మద్దినాయనిపల్లె పంచాయతీ ఎండ్లపల్లె వద్ద హంద్రీ - నీవా కాంక్రీట్ లైనింగ్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎండ్లపల్లె వద్ద జరుగుతున్న పనులతో తమ గ్రామంతో పాటు కొండపల్లె రైతులకు తమ పొలాలకు వెళ్లేందుకు దారి లేకుండా పోతుందని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. హంద్రీ-నీవా కాలువ తవ్వకాల సందర్భంగా 15 ఏళ్ళ క్రితమే తమ పొలాలకు వెళ్లే విధంగా వంతెన నిర్మించాలని కోరినా పట్టించుకోకుండా పనులు చేపట్టారన్నారు. అప్పటి నుంచి కాలువలోనే దారి ఏర్పరచుకుని రాకపోకలు సాగిస్తున్నామన్నారు. ప్రస్తుతం జరుగుతున్న కాంక్రీట్ లైనింగ్ పనులు పూర్తయితే రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయని ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ కాంక్రీట్ లైనింగ్ పనులు జరగాలంటే వంతెన నిర్మించాలన్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు వెంకటరమణారెడ్డి, భాస్కర్, మల్లికార్జున, శంకర, గోపాలకృష్ణ, చరణ్, దేవమ్మ, అనసూయమ్మ, శ్రీలక్ష్మి, రామసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.


హంద్రీ-నీవా కాలువలో నిరసన తెలుపుతున్న ఎండ్లపల్లె గ్రామస్థులు

నాటుసారా తయారీ, అమ్మకాలకు స్వస్తి పలకండి

● జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్

పెద్దమండ్యం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) నాటుసారా తయారీ, అమ్మకాలకు స్వస్తి పలకాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ పిలుపునిచ్చారు. పెద్దమండ్యం మండలం రామానాయక్ తాండా పంచాయతీ బండకింద తాండాలో శుక్రవారం నవోదయం 2.0, నాటుసారా నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దురలవాట్ల నుండి బయటపడి పిల్లల ఉన్నత విద్య కోసం తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. మంచి భవిష్యత్తు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సీడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా తాండా వాసులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జోగేంద్ర, సీఐలు మాధవి, లక్ష్మన్న, సర్పంచ్ శిరీష, తహసీల్దార్ సయ్యద్ అహ్మద్, ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఎస్ఐలు బాబు, రమణ. సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్

జాతరకు చేరుకున్న గొల్లపల్లె గంగమ్మతల్లి


గొల్లపల్లె నుంచి గంగమ్మ జాతరకు వెళుతున్న అమ్మవారు

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గంగమ్మ జాతరకు ముందురోజున అమ్మవారి పుట్టినిల్లు అయిన చెల్లు వంశీయుల ఇంటి నుంచి శుక్రవారం రాత్రి అమ్మవారు బయలుదేరింది. చెల్లు వంశీయులైన అర్చకులు గంగరాజు, జగదీష్ అమ్మవారికి పట్టువస్త్రాలు, గొడుగులు, కేరళ కళాకారుల డప్పు వాయిద్యాలు, బాణాసంచాలతో రాచపల్లె నుంచి గొల్లపల్లెకు చేరుకున్నది. అక్కడ అమ్మవారిని అలంకరించి జాతరకు తీసుకువచ్చారు. దీంతో గంగమ్మతల్లికి పూజలు నిర్వహించారు. జాతర భక్తులు పోటెత్తారు. రాత్రి వేళ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి, టీడీపీ మండల యువజన నాయకుడు యనమల మదన్ మోహన్, ,మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, సీఐ కొండారెడ్డి, ఎస్ఐ రవీంద్ర పోలీసులు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండికిరీటం

సుమారు లక్ష రూపాయల విలువ చేసే వెండి కిరీటం, శూలం, హస్తాలను చక్రాయపేట మండలం దేవరగుట్టపల్లె మాజీ సర్పంచు సుబ్బరామయ్య శుక్రవారం ఆలయ ఈవో శ్రీనివాసులుకు అందజేశారు. ముందుగా అమ్మ వారికి సుబ్బరామయ్య కుటుంబీకులు పూజలు చేశారు.


వెండి కిరీటం అందిస్తున్న సుబ్బరామయ్య

గంగమ్మజాతర ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీఓ


జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె అనంతపురం గంగమ్మజాతర జాతర ఏర్పాట్లను రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులు శుక్రవారం పరిశీలించారు. ప్రత్యేక క్యూలైన్లు, తాగునీరు, విద్యుత్ సౌ కర్యాలపై ఆరా తీశారు. 24 గంటలూ విద్యుత్ ఉండేలా చూడాలన్నారు. 25 ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందజేయాలని ఆర్‌డబ్ల్యూ ఎస్ అధికారులను ఆదేశించారు. వాహనాల పార్కింగ్‌పై సూచనలు ఇచ్చారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు. జాతరలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఈఓకు సూచించారు.

వక్ఫ్ భూముల పరిరక్షణ బాధ్యత ప్రభుత్వానిదే

● ఎమ్మెల్యే షాజహాన్ బాషా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వక్ఫ్ భూముల పరిరక్షణ బాధ్యత ప్రభు త్వం తీసుకుంటుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జామియా మసీదులో ప్రార్థనల అనంతరం బెంగళూరు బస్టాండులో ముస్లింలతో కలసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ గ్రాబింగ్ చట్టప్రకారం వక్ఫ్ భూములను దొంగ రిజిస్టర్లు చేయించుకున్న వారిపై చర్యలుంటాయన్నారు. పట్టణంలోని సర్వే నెంబర్ 130, 144 లలో సబ్ డివిజన్ కాలేదని తహసీల్దార్ సర్టిఫికెట్ ఇచ్చారని, ఈ ఆస్తులు ఎవరిపేరుతో ట్రాన్స్‌ఫర్ కావన్నారు. 1962 గెజిట్‌ప్రకారం ఈ భూములన్నీ దేవదాయ వక్ఫ్ భూములేనన్నారు. కొందరు ఈ భూముల్లోకి వెళ్లి వివాదాలు సృష్టించారని, వీరిపై చట్టం ప్రకారం చర్యలు వుంటాయన్నారు. తనపై కొందరు చేసిన ఆరోపణలు అవాస్తవమన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌కు జామియా మసీదు వక్ఫ్‌ఆస్తుల పరిరక్షణ కమిటీ కన్వీనర్ సికిందర్ అలీఖాన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు గౌస్ మొహియుద్దీన్, అబూబకర్, అక్బర్‌బాషా, సాజిద్‌అలీ, సర్దార్ ఖాన్, గౌస్, సికిందర్, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ సమాజ స్థాపనతోనే వికసిత్ భారత్ సాధ్యం

● జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి

సంబేపల్లె, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ సమాజ స్థాపనతోనే వికసిత్ భారత్ సాధ్యమవుతుందని జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో సంబేపల్లె మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పరిశోధనల వైపు అడుగులు వేయాలన్నారు. తాము ఎంచుకున్న రంగానికి సంబంధించిన నైపుణ్యాలను విద్యార్థులు తప్పనిసరిగా సాధించాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శంకరయ్య మాట్లాడుతూ మన పాఠశాలలో ఉన్న వివిధ ప్రయోగశాలలను సక్రమంగా సద్వినియోగం చేసుకుంటే విద్యార్థుల జీవితం ఉజ్వలంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా చిత్రలేఖనం, క్విజ్, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు రామయ్య, రవిశంకర్, ఉమాదేవి, రెడ్డెయ్యరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయచోటి ఏజీపీగా గడ్డం రవికుమార్

కలికిరి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాయచోటి సివిల్ జడ్జి కోర్టు (సీనియర్ డివిజన్) ఏజీపీగా గడ్డం రవికుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఈ కోర్టులో సివిల్ కేసులను పర్యవేక్షించనున్నారు. ఆయన ఈ పదవిలో మూడేళ్లు కొనసాగనున్నారు. ఈ మేరకు రాష్ట్ర న్యాయ, శాసన వ్యవహారాల కార్యదర్శి గొట్టపు ప్రతిభాదేవి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


మృతి చెందిన జయశేఖర్

ములకలచెరువు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య- శ్రీ సత్యసాయి జిల్లాల సరిహద్దు సమీపంలో ములకలచెరువు వాసి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తనకల్లు పోలీసుల కథనం మేరకు.. ములకలచెరువు నివాసి జయకర్ (41) అలియాస్ నామాలు జిల్లా సరిహద్దులోని తనకల్లు మండలం చీకటిమానిపల్లె వద్ద శుక్రవారం ఉదయం శవమై కన్పించాడు. శరీరంపై గాయాలు ఉండడంతో ఎవరైనా హత్య చేశారేమోనని ములకలచెరువు ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని తనకల్లు పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలి

● పరిశోధనలతోనే వెలుగులోకి వాస్తవాలు ● డీఈవో సుబ్రహ్మణ్యం

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ సాధించాలంటే యువత శాస్త్రీయ ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. రాష్ట్ర సమగ్ర శిక్ష, విద్యాశాఖాధికారుల పిలుపు మేరకు శుక్రవారం రాయచోటి పట్టణంలోని డైట్ ఉన్నత పాఠశాలలో జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో మాట్లాడుతూ శాస్త్రీయ పరిశోధనలతోనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. వాస్తవాలు వెలుగుచూడని అనేక అంశాలు ఉన్నాయని, వాటిపై విద్యార్థులు పరిశోధనలు చేయాలన్నారు. రాయచోటి ఉప విద్యాశాఖాధికారి శివప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వివిధ రంగాలను నిర్దేశించుకుని వాటిని సాధించేటట్లు నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా వికసిత్ భారత్ కోసం విద్యార్థులకు క్విజ్, సెమినార్ పోటీలను నిర్వహించామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి 136 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు, మెమెంటోలు అందజేశారు.


జాతీయ సైన్స్‌డే వేడుకల్లో మాట్లాడుతున్న డీఈవో సుబ్రహ్మణ్యం

వేమయ్యా.. నీది కొబ్బరి చెట్టంత మనసయ్యా..!





ఆయన ఓ పర్యావరణ ప్రేమికుడు. పశువులు, పక్షులు, మొక్కలంటే ఎంతో ఇష్టం. ఎంతంటే.. తన ఇంటిని ఏకంగా చీల్చి ఓ కొబ్బరి చెట్టు కోసం వదిలేసేంత. ఆయనే కడపకు చెందిన రామాపురం వేమయ్య. ఇంతకీ ఆయన ఏం చేశారో తెలుసుకుందామా..!

ఈ ఫొటోలోని వ్యక్తి పేరు రామాపురం వేమయ్య. కడప నగర 9వ డివిజన్ సాయిపేటలో చిన్న పూరిల్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. కొన్నేళ్ల క్రితం ఒక కొబ్బరి మొక్కను నాటారు. అది కాస్తా పెరిగి పెద్దదైంది. కొంత కాలానికి ఈయనకు పక్కాగృహం మంజూరు కావడంతో.. చెట్టుపై ఉన్న ప్రేమను తుంచుకోలేక ఇంట్లోనే ఓ భాగంగా పై కప్పుకు రంధ్రం వేసి వదిలేశారు. ఇప్పుడు ఆ చెట్టుకు ప్రతి సీజన్లో 300 -400 కొబ్బరికాయల కాపు వస్తున్నాయి. లాభం ఆశించకుండా అడిగిన వారికి ఉచితంగా ఇస్తున్నారు. అంతేకాకుండా పశుపక్షాదులను ప్రేమిస్తూ పిల్లలు లేని లోటు తీర్చుకుంటున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప





చెట్టుకు విరివిగా కాసిన కాయలు



ఇంటికి రంధ్రం వేసిన దృశ్యం



ఇంట్లో కలిసిపోయిన కొబ్బరిచెట్టు

డివైడర్‌ను ఢీకొన్న బైకు ఇరువురికి గాయాలు

ముద్దనూరు ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కడప-తాడిపత్రి హైవేలోని చింతకుంట సమీపంలో శుక్రవారం తెల్లవారు జామున గాలేరు-నగిరి కాల్వపై నున్న బ్రిడ్జి డివైడర్‌ను బైకు ఢీకొన్న సంఘటనలో ఇరువురు యువకులకు గాయాలయ్యాయి. ప్రొద్దుటూరుకు చెందిన గౌస్‌బాషా, సుభాన్ బాషా బైకుపై తాడిపత్రి వైపు వెళుతున్నారు. మద్యం మత్తులో డివైడర్‌ను ఢీకొనడంతో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. 108లో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అత్యాచార నిందితుడికి మూడేళ్ల జైలు

వేంపల్లె, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలిరెడ్డిపల్లెలో ఓ మహిళపై అత్యాచారానికి పాల్పడిన గొల్లపల్లె శివనారాయణకు కోర్టు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ తిరుపాల్‌నాయక్ తెలిపారు. 2023 జూన్ 27న మతిస్థిమితం లేని మహిళపై శివనారాయణ అత్యాచారం చేశాడు. ఆమె భర్త వేంపల్లె పోలీస్ స్టేషన్‌లో అప్పట్లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టుకు అప్పగించారు. శుక్రవారం కడప మహిళా కోర్టు మెజిస్ట్రేట్ కోర్టులో విచారణ చేపట్టి నిందితుడికి జైలుశిక్ష, జరిమానా విధించారని ఎస్ఐ తెలిపారు.

బంగారు గొలుసు అపహరణ

ఖాజీపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని బుడ్డాయపల్లె వద్ద ఆవుల లలితమ్మ మెడలో బంగారు గొలుసును దొంగలు లాక్కెళ్లారు. బాధితురాలి కథనం మేరకు రోజు దినచర్యలో భాగంగా కూలి పనులకు వెళ్లి తిరిగి వచ్చి పేరారెడ్డి కొట్టాలు వద్ద రోడ్డుపై గ్రామ మహిళలందరు దిగారు. లలితమ్మ గృహం జాతీయ రహదారి పక్కనే ఉండడంతో నడుచుకుంటూ వెళుతుండగా స్కూటర్‌పై ఇద్దరు వ్యక్తులు హెల్మెట్ ధరించి వచ్చి కర్నూలుకు ఎటు వెళ్లాలమ్మా అని అడుగడంతో ఇదే దారిన వెళ్లండి అని చెప్పి ఆమె వెనుతిరిగింది. ఆ వెంటనే స్కూటర్‌పై ఉన్న రెండవ వ్యక్తి ఆమె మెడలోని గొలుసు లాక్కుని వెళ్లిపోయారు. బంగారం గొలుసు 35 గ్రాములు ఉందని... పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మోహన్ తెలిపారు.

జూదరుల అరెస్టు

చాపాడు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురూరు గ్రామం వద్ద ఉన్న పెన్నానదిలో కంపచెట్ల మధ్య పేకాట ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.5,800 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శ్రీధర్, జేసీ అదితిసింగ్

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అన్ని ప్రాధాన్యత అంశాలలో వైఎస్సార్ జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ, వేసవిలో తాగునీటి సమస్యలు తదితర అంశాలపై రాష్ట్ర పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలశాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులతో కలసి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ పాల్గొన్నారు. సీఎస్ వీసీ ముగిసిన అనంతరం జిల్లాలోని అన్ని మున్సిపల్ అధికారులు ఎంపీడీవోలతో కలెక్టర్ వీసీ ద్వారా సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అందించిన సూచనలను క్షేత్ర స్థాయిలో పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెలలో ఎన్టీఆర్ పెన్షన్ భరోసా లబ్ధి మొత్తాన్ని పంపిణీ చేసే సమయాన్ని ఉదయం 7 గంటల నుంచి ప్రారంభించాలన్నారు. పెన్షనర్ల దగ్గర డబ్బులు వసూలు చేయరాదని సిబ్బందిని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడ భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్నాయని... వేసవిలో తాగునీటికి ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు రాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

జిల్లాలో జరగుతున్న పి-4 సర్వేను మార్చి 2వ తేదీలోగా పూర్తి చేయా లన్నారు. వివిధ సంస్థల్లో వర్క్‌ఫ్రమ్ హోమ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న జిల్లాకు చెంది ఉద్యోగుల డేటాను సర్వేను పారదర్శకంగా ఖచ్చితంగా నిర్వహించాలని డీఎస్ డబ్ల్యూఎస్ సిబ్బం దిని కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మున్సిపల్ కమిషనరు మనోజ్‌కుమార్ రెడ్డి, జడ్పీ సీఈవో ఓబులమ్మ, సీపీవో హజరత్తయ్య, డీపీఓ రాజ్యలక్ష్మి, జిల్లా అధికారులు ఆనంద్‌నాయక్, కిరణ్ కుమార్, అన్ని మండలాలు, మున్సిపాలిటీ కమి షనర్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

శిల్పారామాన్ని మరింతగా అభివృద్ధి చేస్తాం..



శిల్పారామాన్ని సందర్శిస్తున్న స్వామి నాయుడు

కడప కల్చరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): శిల్పా రామాన్ని మరింతగా అభివృద్ధి పరుస్తామని శిల్పారామాల రాష్ట్ర ప్రధాన పరిపాలనాధికారి వి.స్వామినాయుడ స్పష్టం చేశారు. నగర రిమ్స్ సమీపంలో గల శిల్పా రామాన్ని శుక్రవారం ఉదయం ఆయన సందర్శించారు. అక్కడ బోటింగ్, బోట్స్ స్థితిగతులను కడప శిల్పారామం పరిపాలనాధికారి శివప్రసాద్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. బోటింగ్ ఐలాండ్ చుట్టూ బోగానుపూల మొక్కలను, సందర్శకులు వచ్చి కూర్చునేలా సిమెంట్ బెంచ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రధానంగా మెయిన్ గేట్ ఎంట్రన్స్ నుంచి ఆంపియా థియేటర్ వరకు రోడ్డు కిరువైపులా పూల మొక్కలను నాటించాలని ఆదేశించారు. నాటిన మొక్కలకు వాటర్ డ్రిప్ సిస్టం ఏర్పాటు చేయాలని.. ఇందుకు అవసరమైన నిధులను కూడా విడుదల చేయిస్తామని తెలిపారు.

ప్రభుత్వ సాయంతో ఆర్థికాభివృద్ధి సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ ఆనందనాయక్

కడప ఎన్టీఆర్‌సర్కిల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేస్తున్న ఆర్థిక సాయం అందిపుచ్చుకొని లబ్ధిపొందిన ప్రతి ఒక్కరు ఆర్థికాభివృద్ధిని సాధించాలని డీఆర్‌డీఏ పీడీ ఆనందనాయక్ పేర్కొన్నారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన కన్వర్జన్సీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనమాట్లాడుతూ పేదలు మధ్య తరగతి కుటుంబాలు మెరుగైన జీవనోపాదులు పొందేందుకు ప్రభుత్వం అనేక విధాలుగా ప్రోత్సహిస్తోందన్నారు. ఈక్రమంలో సంక్షేమ ఫలాలు పొందిన వారు ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో ఎల్ఈఎం జగన్నాథం, మత్స్యశాఖ డీడీ శాంతి, నాబార్డు డీడీఎం విజయవిహారి, పశువర్ధకశాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి గ్రామోత్సం



గ్రామోత్సవంలో గోవిందమాంబ సమేత వీరబ్రహేంద్రస్వామి

బ్రహంగారిమఠం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మహాశివ రాత్రి ఉత్సవాలలో భాగంగా నాలుగోరోజు శుక్రవారం వీరబ్రహేంద్రస్వామి సమేత గోవిందమాంబల గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మంగారిమఠంలో స్వామి నివాస గృహం నుంచి గ్రామ పురవీధుల్లో భక్తిశ్రద్ధలతో ఉరేగింపు నిర్వహించారు. కాగా, ఇటీవల కల్యాణ మహోత్సవాలకు భక్తులు తరలివచ్చి స్వామివారికి సమర్పించిన కానుకలను లెక్కించగా సుమారు రూ.53,529లు దేవస్థానానికి ఆదాయం వచ్చినట్లు ఆలయ పిట్‌పర్సన్ శంకర్‌బాలజీ తెలిపారు.

అలాగే శుక్రవారం తెల్లవారుజామున ఈశ్వరీదేవికి పురవీధుల్లో సింహవాహనంపై ఉరేగింపు నిర్వహించారు. మహా నైవేద్యంతో మహాశివరాత్రి ఉత్సవ వేడుకలు ముగిసినట్లు మఠాధిపతులు వీరశివకుమార్ స్వామి తెలిపారు. గ్రామోత్సవంలో దేవస్థానం సిబ్బంది గోపాల్, పరిపూర్ణాచారి, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ఏపీకార్ల్‌లో అమెరికన్ కంపెనీ బృందం పర్యటన



పులివెందుల ఏపీకార్ల్‌లో అమెరికన్ బృందం పరిశీలన

పులివెందుల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఏపీకార్ల్‌లో మ్యాక్స్‌వెల్ బయో సైన్సెస్ బృందం శుక్రవారం పర్యటించింది. ఏపీలో కొత్త కంపెనీలను స్థాపించడంలో భాగంగా తమ కంపెనీని స్థాపించడానికి సంబంధించి కంపెనీకి చెందిన ప్రవీణ్‌రెడ్డి, శాస్త్రవేత్తలు పర్యటించినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి అడ్వైజర్ డాక్టర్ విరామ్‌నాథ్, మ్యాక్స్‌వెల్ ప్రెసిడెంట్ ప్రవీణ్‌రెడ్డి, సీఈఓ రిథమ్‌సోధి, ఎంఎస్ఎమ్ఈ ప్రిన్సిపల్ టెక్నికల్ అడ్వైజర్ డాక్టర్ ఎంఎస్ శంకరప్రసాద్, ఏపీకార్ల్ సీఈఓ శ్రీనివాసప్రసాద్ తదతరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి మహా శివరాత్రి ఆదాయం రూ.73,97,613

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వివిధ శైవక్షేత్రాలకు భక్తులు వెళ్లేందుకు వీలుగా ఆర్టీసీ కడప రీజియన్ పరిధిలో గల (కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మల మడుగు, బద్వేలు, పులివెందుల) డిపోల ద్వారా 253 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. వీటి ద్వారా ఆర్టీసీకి రూ.73,97,613 ఆదాయం సమకూరినట్లు ఆర్టీసీ కడప ఆర్ఎం గోపాల్‌రెడ్డి వెల్లడించారు. ఈసందర్భంగా ఆర్టీసీ బస్సులలో ప్రయాణం చేసి ఆదాయం సమకూర్చిన భక్తులకు, సహకరించిన పోలీసు సిబ్బందికి, ప్రత్యేకించి ఆర్టీసీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు : జేసీ

సింహాద్రిపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఇచ్చిన అర్జీలు త్వరిత గతిన పరిష్కరించాలని.. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ రెవెన్యూ సిబ్బందిని హెచ్చరించారు. శుక్రవారం సింహాద్రిపురం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి.. రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. పీజీఆర్ఎస్, గ్రామ రెవెన్యూ అర్జీలపై సమీక్ష నిర్వహించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో కాలయాపన జరుగకుండా చూడాలని ఆదేశించారు. భూ రీసర్వేలో రైతుల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారం ఎంత వరకు వచ్చిందని ఆరా తీశారు. పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య, డీఐ హేమలత, తహశీల్దార్ నాగేశ్వర్‌రావు, డీటీ హరిబాబు, వీఆర్వోలు పాల్గొన్నారు.

విద్యార్థులు గ్లోబల్ లీడర్లుగా ఎదగాలి

వేంపల్లె, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ట్రిపుల్‌ఐటీలో చదివే విద్యార్థులు పట్టుదలతో ఉన్నతచదువులు చదివి గ్లోబల్ లీడర్లుగా ఎదగాలని చిత్తూరు జాతీయ వాతావరణశాఖ శాస్త్రవేత్త డాక్టర్ రామ్‌కుమార్ తెలిపారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో జాతీయ సైన్స్ దినోత్సవం, అభియంత్‌ఫెస్ట్‌లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించారు. శాస్త్రవేత్త మాట్లాడుతూ విద్యార్థి దశలోనే కొత్తకొత్త ఆలోచనలతో ప్రయోగాలు చేయాలని, ప్రయోగాలు సక్సెస్ అయితే అంతర్జాతీయంగా పేరుప్రఖ్యాతలు సాధిస్తారని ఆయన తెలిపారు. గ్లోబల్ లీడర్‌షిప్, వికసిత్‌భారత్ సైన్స్ అండ్ ఇన్నోవేషన్ గురించి విద్యార్థులకు సవివరంగా తెలిపారు. కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటీ అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి చదును... రెండు వాహనాలు సీజ్

పెండ్లిమర్రి;ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 1లో ప్రభుత్వ భూమిని చదును చేస్తున్న రెండు వాహనాలను శుక్రవారం సీజ్ చేసినట్లు తహశీల్దార్ అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని చదును చేస్తున్నారన్న సమాచారం రాడంతో ఆర్ఐ శ్రీనివాసులు, వీఆర్వో వెంకట సుబ్బయ్యలను అక్కడికి పంపడం జరిగిందన్నారు. అలాగే ఎస్సై మధు సూదన్ రెడ్డి తన సిబ్బందితో అక్కడికి చేరుకుని భూమిని చదును చేస్తున్న ఒక హిటాచి, ఒక ఎక్స్‌కవేటర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించారన్నారు.

నిర్మలా ఫార్మసీ కళాశాలకు అటానమస్ హోదా

- కళాశాల చైర్మన్ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌కుమార్

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఉక్కాయపల్లె నిర్మలా ఫార్మసీ కళాశాలకు 2025-26 విద్యా సంవత్సరం నుంచి యూజీసీ అటానమస్ హోదా లభించిందని ఆ కళాశాల చైర్మన్ శ్రీనివాసులు, ప్రిన్సిపల్ డాక్టర్ యు.మోహన్‌కుమార్ తెలిపారు. ఈసందర్భంగా కళాశాల చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ నిర్మలా కళాశాలలో 24 ఏళ్ల నుంచి ఉన్నతమైన విలువలు, ప్రమాణాలు పాటిస్తూ నాణ్యమైన విద్యనందిస్తున్నామన్నారు. విద్యార్థులను ఫార్మసీ రంగంలో సాంకేతికంగా నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దటానికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి, ప్రతి ఏడాది ప్రాంగణ ఎంపికల ద్వారా అనేక మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నామని తెలిపారు.

తగ్గేదేలే...

- స్టైఫండ్ పెంచేవరకు పోరాటమే..
- ప్రభుత్వ పశువైద్య విద్యార్థుల ఆందోళన
- 26వ రోజుకు చేరిన నిరవదిక సమ్మె



కళాశాల ఆవరణలో 26వ రోజు సమ్మెలో పాల్గొన్న విద్యార్థులు

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నాలుగున్నర ఏళ్లపాటు పశువైద్య విద్యను అభ్యసించి తర్వాత 12 నెలలపాటు ఇంటర్న్‌షిప్ కోర్సు చేయాల్సి ఉంటుంది. ప్రతి విద్యార్థి ఆరు నెలలు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో.. మరో ఆరు నెలలు ఇతర రాష్ట్రాల్లో ఇంటర్న్‌షిప్‌కోర్సు పూర్తి చేయాలి. ఈ సమయంలో ప్రభుత్వం నెలకు కేవలం రూ.7వేలు చెల్లిస్తోంది. ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో ప్రభుత్వం చెల్లించే స్టైఫండ్ తమ ఖర్చులకు సరిపోవడం లేదంటూ... తరగతులు బహిష్కరించి నిరసన బాట పట్టారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు తమ గోడు వెల్లబోసుకున్నా ఫలితం లేదని... ప్రభుత్వం స్టైఫండ్ పెంచుతూ జీవోను విడుదల అయ్యేవరకు సమ్మెను కొనసాగిస్తాం.. తెగేసి చెబుతున్నారు. ఈ నేపధ్యంలో పశువైద్య విద్యార్థులు చేపడుతున్న ఆందోళన 26వ రోజుకు చేరుకుంది. వివరాల్లోకి వెళితే..

తిరుపతి వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలో తిరుపతి, ప్రొద్దుటూరు, గరివిడి, గన్నవరం ప్రాంతాల్లో ప్రభుత్వ పశువైద్య కళాశాలలు నడుస్తున్నాయి. వీటిలో సుమారు రెండు వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. సుమారు 400 మంది ఇంటర్న్‌షిప్ చేస్తున్నారు. 2013లో పశువైద్యకళాశాల విద్యార్థులకు, వైద్య రంగ విద్యార్థులకు సమానంగా స్టైఫండ్ రూ.7వేలు ప్రభుత్వం చెల్లించేది. వైద్య రంగం (ఎంబీబీఎస్) విద్యార్థులకు ఏటా స్టైఫండ్‌ను పెంచుతూ ప్రస్తుతం వారికి రూ.25,300 చెల్లిస్తున్నారు. పశువైద్య విద్యార్థులకు మాత్రం 2013 నుంచి నేటి వరకు రూ.7వేలు మాత్రమే స్టైఫండ్‌గా ఇస్తున్నారు. ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపధ్యంలో బయటి ప్రాంతాల్లో విధులు నిర్వహించడానికి రూము అద్దె, భోజన వసతి, రవాణా ఖర్చులకు ఈ రూ.7వేలు ఏమూలకు సరిపోతాయన్నది ఈ విద్యార్థుల వాదన.

ఇతర రాష్ట్రాలలో...

పశువైద్య విద్యార్థులకు కర్ణాటక, రాజస్థాన్, కేరళ రాష్ట్రాల్లో రూ.23వేలు, బీహార్‌లో రూ.24 వేలు, ఒరిస్సాలో రూ.22 వేలు, యూపీలో రూ.23,500, తమిళనాడు, హర్యాణా, పశ్చిమబెంగాల్, జార్ఖండ్ రాష్ట్రాల్లో రూ.25వేలు ఇస్తున్నారని ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే రూ.7 వేలు ఇవ్వడం ఏమిటని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నెలకు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉన్నతాధికారులకు విన్నపం

స్టైఫండ్ పెంచాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేష్, సత్యకుమార్, అచ్చెంనాయుడుతో పాటు ఉన్నతాధికారులను కలిసి తమ సమస్యలను వివరించామన్నారు. ప్రతి ఒక్కరు మౌకికంగా హామిలిచ్చి కాలయాపన చేస్తున్నారే కానీ స్పష్టమైన ఆదేశాలు కరువయ్యాయన్నారు. వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు పశువైద్య విద్యార్థులకు స్టైఫండ్ పెంచాలని రాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాశారని వివరించారు.

జీవో విడుదల చేయాలి

- రోషిత్‌కుమార్, విద్యార్థి



పశువైద్య విద్యార్థులకు స్టైఫండ్ పెంచుతూ ప్రభుత్వం వెంటనే జీవో విడుదల చేయాలి. ఉపకార వేతనం పెంచకపోతే ఆందోళన విరమించేది లేదు.

మానవత్వంతో ఆలోచించాలి

- వి.రజిత, విద్యార్థిని



న్యాయపరమైన సమస్యపై పోరాటం చేస్తున్నాం. వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ అందించాలని మాత్రమే కోరుతున్నాం. గొంతెమ్మ కోర్కెలు కోరడంలేదు.

తల్లిదండ్రులపై ఆధారం

- శరణ్య, విద్యార్థిని



ప్రస్తుతం ఇస్తున్న గౌరవ వేతనం కనీస అవసరాలకు సరిపోదు. ఇప్పటికి కూడా తల్లిదండ్రులపై ఆధారపడటం బాధగా ఉంది. పశువైద్య విద్యార్థులంటే ఎందుకంత అలుసు.

బడ్జెట్‌లో సూపర్‌సిక్స్‌కు మొండిచేయి

వేంపల్లె, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌లో సూపర్‌సిక్స్ పథకాలకు కూటమి ప్రభుత్వం మొండిచేయి చూపిందని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బడ్జెట్‌లో రాష్ట్ర అభివృద్ధిని, సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేశారని తులసిరెడ్డి పేర్కొన్నారు.

నేటి నుంచి గంగమ్మ జాతర

సికెదిన్నె, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె గంగమ్మ జాతర శనివారం నుంచి రెండు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఈవో క్రిష్ణానాయక్ తెలిపారు. అమ్మవారిశాల వీధిలో బండలాగుడు పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు,అమ్మవారి కల్యాణం, అన్నదానం ఉంటుందన్నారు. అదే విధంగా జాతర ముగిసిన అనంతరం నాలుగు ఆదివారాలు ప్రత్యేక అలంకరణలో అమ్మవారు దర్శనమివ్వనున్నారు.

అనాథశవానికి అంత్యక్రియలు

కడప కల్చరల్, ఫిబ్రవరి 28, (ఆంధ్రజ్యోతి): నగరంలోని శంకరాపురానికి చెందిన వల్లెపు దేవాక్షమ్మ (70) అనే వృద్ధురాలు అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందింది. అంత్యక్రియలు చేసే ఆర్థిక స్థోమత లేక పోగా బంధువులు సైతం సహకరించలేదు. దీంతో కాశీ విశ్వనాథ సేవా సమితి ప్రతినిధులు గుండ్లకొండ రవి బృందం హిందూ సాంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు జరిపించారు. కార్యక్రమంలో రెడ్డిలక్ష్మణ్, పి. పురుషోత్తం, దామోదర్, టైలర్ రవి, ఎలక్ట్రీషియన్ మధు తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో ప్రధాన రోడ్లు



వేంపల్లె, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని ప్రధాన రోడ్లు అయిన కడప, పులివెందుల రోడ్లు అంధకారంలో ఉన్నాయి. వీధిలైట్లు వెలగడం లేదు. రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా విద్యుత్‌మరమ్మతు పనులు చేస్తుండగా గతంలో ఉన్న వీధిలైట్లను తొలగించారు. ప్రస్తుతం ప్రధాన రహదారిలో కొత్త విద్యుత్ స్తంభాలు చాలా వరకు ఏర్పాటు చేశారు. పంచాయతీ అధికారులు వీధిలైట్లు బిగించకపోవడంతో రాత్రి అయితే ప్రధాన రోడ్లు అంధకారంలో ఉన్నాయని ప్రజలు కోరుతున్నారు.

అసాంఘికాలకు 'మార్కెట్' యార్డు

> కమలాపురం నగర పంచాయతీలోని మార్కెట్ యార్డు మందు బాబులకు నిలయంగా మారుతోంది. ఒకప్పుడు రైతుల ధాన్యంతో కళకళలాడిన మార్కెట్‌యార్డు నేడు అసాంఘిక కార్యకలాపాలకు మార్కెట్‌గా నిలిచిందని చెప్పవచ్చు. గంజాయిబ్యాచ్ ఇక్కడ స్థావరం ఏర్పచుకుందనేది సమాచారం. వీటన్నింటికీ ప్రధాన కారణం కాంపౌండ్‌వాల్ దెబ్బతినడమేనని చెప్పవచ్చు.

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కమలాపురం నగర పంచాయతీలోని క్రాస్ రోడ్డు వద్ద ఉన్న మార్కెట్‌యార్డు మందు బాబులకు నిలయంగా మారింది. ప్రతిరోజూ ఉదయం, రాత్రి, అర్ధరాత్రి అని తేడా లేకుండా మందు తాగడం, వ్యర్థాలను అక్కడే పడేయడం, రాత్రి వేళల్లో గంజాయి బ్యాచ్ గట్టిగా కేకలు వేయడం ఇక్కడ జరిగే తంతు. రైతులు పండించిన పంటలు ఆర పోసుకోవడానికి నిర్మించిన సిమెంటు రోడ్డు మరుగుదొడ్డిగా మారింది. అలాగే కోళ్ల వ్యర్థాలకు కూడా కొలువైంది. ఒకప్పుడు రైతులతో కళకళలాడిన మార్కెట్‌యార్డు నేడు మలమూత్ర విసర్జనకు గంజాయి తాగే వారికి అడ్డాగా మారింది. మద్యం తాగి మందుబాబులు వీరంగం సృష్టిస్తూ ఉంటారు. ఆ దారిన పోయే ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు సమాచారం. ఈ మధ్యకాలంలో కమలాపురం పోలీసులు కొన్ని ప్రాంతాలను ఎంచుకుని మద్యం తాగకుండా నివారించారు. అయితే కమలాపురం మార్కెట్ యార్డును అభివృది పరచి వారం వారం సంత ఏర్పాటు చేస్తే ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసిన వారు అవుతారని ప్రజలు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో రైతులు పండించిన పంటలను నిల్వ ఉంచుకునేందుకు ఆరబెట్టుకునేందుకు అయితే మందు బాబుల వల్ల ఎలాంటి ఇబ్బందులు కలుగుతా యోనని రైతులు భయపడుతున్నారు. గతంలో మార్కెట్‌యార్డు చుట్టూ కాంపౌండు ఉండేది, ఇప్పుడు పూర్తిగా దెబ్బతింది.



మార్కెట్‌యార్డులో పారబోసిన కోళ్ల వ్యర్థ పదార్థాలు

కాంపౌండ్‌వాల్ నిర్మాణం చేపడతాం...



సాయంత్రం పూట మందుబాబులు వస్తున్న మాట వాస్తవమే. దీనికి ప్రధాన కారణం కాంపౌండ్ వాల్ లేకపోవడమే. ఈ విషయమై స్థానిక పోలీసులకు తెలపగానే రాత్రిపూట గస్తీ నిర్వహిస్తున్నారన్నారు. మార్కెట్‌యార్డు అభివృద్ధి కోసం ఒక కోటి 20 లక్షల రూపాయలతో నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి చేశాం. పూర్తి సిబ్బంది లేకపోవడం వల్ల కొంత ఇబ్బంది కలుగుతోంది. నూతన పాలకమండలి బాధ్యతలు చేపట్టగానే కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపడతాం. స్వచ్ఛభారత్ కింద ఉన్న సిబ్బందితోనే మార్కెట్‌యార్డు శుభ్రం చేస్తున్నాం.

ప్రసాద్, మార్కెట్‌యార్డు కార్యదర్శి, కమలాపురం



మండల కేంద్రంలో కడప-పులివెందుల ప్రధానరహదారి, వీధుల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో చిన్న పిల్లలు, వృద్ధులు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే ఎక్కడ కరుస్తాయోనని భయపడుతున్నారు. పంచాయతీ సిబ్బంది స్పందించి కుక్కల బెడద సమస్య తీర్చాలని స్థానికులు వేడుకుంటున్నారు.

- పెండ్లిమర్రి (ఆంధ్రజ్యోతి)

ఉపాధి పనుల తనిఖీ

వల్లూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొప్పోలు, కుమారునిపల్లి గ్రామాలలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం అక్కడ పనిచేసిన ఉపాధి కూలీలతో సమావేశమయ్యారు. అనంతరం చేసిన పనిని అక్కడి అధికారులతో అడిగి తెలుసుకున్నారు.

దర్జీలను ప్రభుత్వం ఆదుకోవాలి

వేంపల్లె, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కుట్టుమిషనే ఆధారపడి జీవిస్తున్న దర్జీలను ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి డిమాండ్ చేశారు. ప్రపంచ దర్జీల దినోత్సవం సందర్భంగా వేంపల్లెలో కొన్ని సంవత్సరాలుగా టైలర్ పనిచేస్తున్న సుప్రీం టైలర్ నాయబ్‌రసూల్, రత్నను తులసిరెడ్డి దంపతులు, కాంగ్రెస్ నాయకులు శాలువ, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మామిడిపూత తోటలకు తేలికపాటి తడులను ఇవ్వాలి

చక్రాయపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మామిడిపూత తోటలకు తేలికపాటి తడులను ఇవ్వాలని కేవీకే శాస్త్రవేత్త మానస రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని సురభి పంచాయతీ రెడ్డివారిపల్లె గ్రామంలో మండల ఉద్యాన అధికారి రెడ్డయ్య ఆధ్వర్యంలో మామిడిలో చేపట్టాల్సిన సస్యరక్షణపైశిక్షణ ఇచ్చారు. అనంతరం సూచనలు,సలహాలు ఇచ్చారు.

దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్య , ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. శుక్రవారం డ్రైడే-ఫ్రైడేలో భాగంగా నగరంలోని అల్మాస్ పేట యానాది కాలనీలో డీఎంఅండ్ హెచ్‌ఓ పర్యటించారు. ఈకార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్, అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, మెడికల్ ఆఫీసరు శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ పాలనలో అరాచకం విధ్వంసం'



మాట్లాడుతున్న గోవర్ధన్‌రెడ్డి

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ఐదేళ్లపాటు రాష్ట్రంలో అరాచకం, విధ్వంసం జరిగాయని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో వైసీపీ శ్రేణులు చేసిన ఆగడాలపై జగన్‌మోహన్‌రెడ్డి నోరు మెదిపి ఉంటే ఇపుడు ఈ సమస్య ఉత్పన్నమయ్యే పరిస్థితి ఉండేది కాదన్నారు. ప్రజావేదిక కూల్చడం నుంచి చంద్రబాబు అరెస్టు వరకు వైసీపీ అరాచక పాలన కొనసాగించిందన్నారు. కరోనా సమయంలో కేవలం మాస్కులు అడిగినందుకు డాక్టర్ సుధాకర్‌ను పిచ్చివాడిని చేసి చంపేసిన వైనం అందరూ గమనించారన్నారు. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు తన కారు డ్రైవర్‌ను చంపి డోర్‌డెలివరీ చేసిన విషయాన్ని మరవలేదన్నారు. దువ్వాడ శ్రీనివాస్ తన ఫ్యామిలీని వదిలిపెట్టి మరొకరితో సహజీవనం చేస్తూ తాను చేసేది కరెక్ట్ అని చెప్పడం ఎంత వరకు సబబు అన్నారు. పోసాని తన నోటికొచ్చిన విధంగా మాట్లాడి మహిళలను మానసిక వేదనకు గురిచేశారన్నారు. టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు జయరాం, ఎస్సీ సెల్ కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'పోసాని అరెస్టుపై వైసీపీ నేతల మాటలు హాస్యాస్పదం'



మాట్లాడుతున్న హరిప్రసాద్

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పోసాని అరెస్టుపై వైసీపీ నేతలు మాట్లాడడం హాస్యాస్పదమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి.హరిప్రసాద్ తెలిపారు. శుక్రవారం కడప నగరం హరిటవర్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోసాని అరెస్టు అక్రమం అని మాట్లాడుతున్న మాజీ సీఎం జగన్, వైసీపీ నేతలు సిగ్గుపడాలని చెప్పారు. సొంత చెల్లెళ్లపై అసభ్య పోస్టులు పెట్టించిన జగన్‌కు కూటమి ప్రభుత్వం గురించి మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. మరో 15ఏళ్ల కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడం ఖాయమన్నారు. టీడీపీ నేతలు పాల్గొన్నారు.

సైన్స్‌పట్ల ఆసక్తి పెంచుకోవాలి



నమూనాలను పరిశీలిస్తున్న యోగివేమన ప్రొఫెసర్ క్రిష్ణారెడ్డి

సికెదిన్నె, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైన్స్‌పట్ల ఆసక్తి పెంచుకోవాలని యోగివేమన విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ క్రిష్ణారెడ్డి తెలిపారు. స్థానిక శ్రీచైతన్య విద్యాసంస్థల్లో విద్యార్థులు తయారు చేసిన సైన్స్ నమూనాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకుని జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. భౌతిక శాస్త్రంలో రామన్ ఎఫెక్ట్ గురించి ప్రపంచ వ్యాప్తంగా తెలుసునని ఆయన సాధించిన ఖ్యాతిని ప్రపంచం గుర్తించిందన్నారు. ఆయన జయంతిని ప్రతి సంవత్సరం సైన్స్‌డేగా జరుపుకోవడం జరుగుతోందన్నారు. ఏజీఎం రమణయ్య మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదలతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు అందుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదిరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రశ్నించేతత్వం అలవరచుకోవాలి

డీఈఓ షంషుద్దీన్



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న డీఈవో షంషుద్దీన్, కరస్పాండెంట్ వికాస్ హరికృష్ణ

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలని డీఈవో షంషుద్దీన్ అన్నారు. శుక్రవారం కడప నగరం అక్కాయపల్లె వికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో నేషనల్ సైన్స్‌డే సందర్భంగా ఏర్పాటుచేసిన సర్ సీవీ రామన్ సైన్స్ ఎక్స్‌పో-2025ను పాఠశాల కరస్పాండెంట్ వికాస్ హరికృష్ణతో పాటు డీఈవో షంషుద్దీన్ ప్రారంభించారు. డీఈవో మాట్లాడుతూ సైన్స్ ఎక్స్‌పోలో విద్యార్థుల ప్రదర్శన అబ్బురపరిచిందన్నారు. సర్ సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకొని ప్రతి విద్యార్థి ఒక శాస్త్రవేత్తగా ఎదగాలని కోరారు. ఎంఈఓ గంగిరెడ్డి, ఉమెన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సలీంబాషా, ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వీరసుదర్శన్‌రెడ్డి,సహదేవరెడ్డి, హెచ్‌ఎం హమీద్, ప్రిన్సిపాల్ ఫాతిమ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బళ్లారి రోడ్డు విస్తరణకు సర్వే పనులు

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని మాసాపేట సర్కిల్ నుంచి అమీన్‌పీర్‌దర్గా, బళ్లారి రోడ్డు, అల్మాస్ పేట సర్కిల్ వరకు రోడ్డు విస్తరణకు కార్పొరేషన్ సర్వే అధికారులు పనులు ప్రారంభించారు. నాలుగు రోజులుగా బళ్లారి రోడ్డు కిరు వైపుల ఎంక్రోజ్‌మెంట్‌లను గుర్తిస్తున్నారు.

రేషన్ సరఫరాలో అలసత్వం జరిగితే క్షమించేది లేదు

పులివెందుల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరఫరాలో అలసత్వం జరిగితే క్షమించేది లేదని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని సివిల్ సప్లై గోడౌన్‌ను ఆమె తనిఖీ చేశారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆర్డీఓ చెన్నయ్య, తహసీల్దార్ నజీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

4న సర్వసభ్య సమావేశం

వల్లూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఈనెల 4న మండల సర్వసభ్యసమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రఘురామ్ తెలిపారు. సమావేశం మండల అధ్యక్షురాలు మల్లీశ్వరి ఆధ్వర్యంలో జరుగనుందన్నారు. మండల స్థాయి, సచివాలయ స్థాయి అధికారులు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 10 గంటలకు రావాలని ఎంపీడీవో తెలిపారు.

పరిశుభ్రతను పాటించాలి

పులివెందుల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉలిమెల్ల లేక్, శిల్పారామంలో పరిశుభ్రతను పాటించాలని శిల్పారామం సీఈఓ స్వామినాయుడు అన్నారు. శుక్రవారం లేక్‌ను ఆయన సందర్శించారు. సందర్శకుల కోసం ఉచిత రక్షిత తాగునీటిని, టికెట్ కౌంటర్‌లో బారీకేడ్ ఏర్పాటుచేయాలన్నారు.శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

20శాతం నిధులు పాఠశాల విద్యకు కేటాయించాలి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్‌లో 20శాతం నిధులు కేటాయించాలని కొఠారి కమీషన్ చెప్పిన దానిని పట్టించుకోకుడా, రాష్ట్ర ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పాఠశాల విద్యాశాఖ 9.86శాతం మాత్రమే నిధులను కేటాయించడం పట్ల యూటీఎఫ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. బడ్జెట్‌లో 20శాతం నిధులు పాఠశాల విద్యకు కేటాయించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ, మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబు డిమాండ్ చేశారు.

కొంతమేర నిరాశపరిచిన రాష్ట్ర బడ్జెట్

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్ రూ.3.22లక్షలకోట్లలో విద్యకు రూ.34311కోట్లు మాత్రమే కేటాయించడం నిరాశపరిచిందని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ బకాయిలు చెల్లింపునకు బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడం అన్యాయమన్నారు.

యువత మత్తుకు దూరంగా ఉండాలి

వేంపల్లె, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని వక్తలు విద్యార్థులకు తెలియజెప్పారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో అభియంత్ ఫెస్ట్‌లో భాగంగా ఆర్కేవ్యాలీ పోలీసులు కడప జిల్లా కళాజాత బృందం ప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రదర్శన చేశారు. కాగా అభియంత్ ఫెస్ట్‌లో భాగంగా 2వ రోజు శుక్రవారం విద్యార్థుల ప్రయోగాలను సహచర విద్యార్థులు, సీనియర్లు, జూనియర్ విద్యార్థులు పరిశీలించారు. ట్రిపుల్‌ఐటీ క్యాంపస్ ఆటస్థలంలో ఏర్పాటుచేసిన ఫుడ్ కోర్టుల వద్ద విద్యార్థులు కోలాహలంగా కనిపించారు.

తెలుగు సాహిత్య విమర్శకు ఒరవడి దిద్దిన రా.రా

కడప కల్చరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్య లోకంలో రా.రాగా ప్రసిద్ధులైన రాచమల్లు రామచంద్రారెడ్డి సంవేదన తెలుగు త్రైమాసిక పత్రిక సంపాదకుడిగా తెలుగు సాహిత్య విమర్శకు నూతన ఒరవడిని దిద్దారని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. రారా జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక కడప రెడ్డి సేవా సమితి కార్యాలయంలో జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి, అధ్యక్షుడు కె. నాగిరెడ్డి, ఏపీ అధికార భాషా సంఘం పూర్వ సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య, విశ్రాంత ఉపాధ్యాయులు కె.చెంచిరెడ్డి, ఎం.రమణయ్య పాల్గొన్నారు.

పశువైద్య విద్యార్థులకు స్టైఫండ్ పెంచాలి

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పశువైద్య విద్యార్థులకు స్టైఫండ్ పెంచాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ మంత్రి పశువైద్య విద్యార్థులతో చర్చలు జరిపి వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు.

శ్రీచైతన్యపాఠశాలలో సైన్స్ ఎక్స్‌పో 2025



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న డాక్టర్ వెంకటరమణ

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని చిన్నచౌక్ శ్రీచైతన్య పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సీవీ రామన్ సైన్స్ ఎక్స్‌పో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన యోగివేమన విశ్వవిద్యాలయ జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎస్‌పీ వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకత పెంపొందించి పరిశోధనల వైపు మరలాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన ప్రయోగాలను పరిశీలించారు. ప్రిన్సిపాల్ నాగభూషణం మాట్లాడారు. బహుమతులు గెలుచుకున్న విద్యార్థులను ఏజీఎం రమణయ్య అభినందించారు.

పక్షవాతానికి అత్యాధునిక ఇంజక్షన్

డాక్టర్ జగదీశ్వర్‌రెడ్డి, న్యూరోవైద్యుడు



కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న జగదీష్ న్యూరోకేర్‌లో దీర్ఘకాలిక నొప్పులకు ప్రత్యేక చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, పక్షవాతం వచ్చిన రెండు, మూడు గంటల్లో నివారించేందుకు ఎమర్జెన్సీ ఇంజక్షన్, త్రాంబోలైసిస్ అందుబాటులో ఉందని ప్రముఖ న్యూరోవైద్యుడు డాక్టర్ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జగదీష్ న్యూరో కేర్ 12వ వార్షికోత్సవం సందర్భంగా డాక్టర్ జగదీష్ మాట్లాడుతూ వార్షికోత్సవం పురస్కరించుకొని తమ సిబ్బంది,పారా మెడికల్ సిబ్బంది కలిసి 30 మంది రక్తదానం చేశారన్నారు. ఎమర్జెన్సీ యాక్సిడెంట్ చికిత్స, సిటీస్కాన్,రేడియాలజిస్ట్ వైద్య సేవలు అనంతరం సేవలు అందించడానికి ఐసీవీ స్పెషలిస్ట్ డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి,జనరల్ ఫిజీషియన్ డాక్టర్ క్రాంతిరెడ్డి, నిపుణులైన వైద్యసిబ్బంది అందుబాటులో ఉన్నారని ఆయన తెలిపారు.

ముంపు వాసుల సమస్యలు పరిష్కరించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కొండాపురం మండలంలోని గండికోట జలాశయం పూర్తై దాదాపు పదేళ్లు అయినా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పరిహారం తక్షణం చెల్లించి, పునరావాస కాలనీలలో మౌలిక సదుపాయాలతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని శుక్రవారం కలెక్టరేట్ వద్ద జరిగిన ఆందోళనలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర హెచ్చరించారు. అనంతరం డీఆర్‌ఓ విశ్వేశ్వరనాయుడును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీరైతు సంఘంజిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, ఉప ప్రధాన కార్యదర్శి కేసీ బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ విద్య ఎంతో ఉన్నతమైంది

సికెదిన్నె, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఫార్మసీ విద్య ఎంతో ఉన్నతమైందని ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.విలియంకేరీ తెలిపారు. స్థానిక రామిరెడ్డి మెమోరియల్ ఫార్మసీ కళాశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మసీ విద్య ద్వారా ఎందరో ప్రాణాలు కాపాడే మందులను తయారు చేసే గొప్ప విద్యా అవకాశమన్నారు. ఫార్మసీ విద్య పూర్తి చేసిన వారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించి వారి ఉన్నత భవిష్యత్తుకు సహకరిస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ నెల్సన్‌కుమార్ మాట్లాడుతూ అనుభవం, అర్హతగల మంచి అధ్యాపకులతో విద్యను అందించి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఈశ్వర్‌రెడ్డి, సెక్రటరీ జయసుబ్బారెడ్డి, కోశాధికారి రామచంద్రారెడ్డి, అధ్యాపక సిబ్బంది నరసింహారావు, రాజారాం, మనోహర్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.





సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్య అతిథి విలియంకేరీ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

రాష్ట్రస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీలకు ఎంపిక

జమ్మలమడుగు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వేంపల్లిలో తలిశెట్టి ఉన్నతపాఠశాలలో ఫ్లోర్‌బాల్ సెలక్షన్స్ జరిగాయి. ఈ ఎంపికల్లో డిగ్రీ ఫస్ట్‌ఇయర్ బీఎస్సీ విద్యార్థి పి.హుస్సేన్‌బాష, రెండవ సంవత్సరం విద్యార్థి శివనాగరాజు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. వారు మార్చి 2, 3 తేదీల్లో తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

లబ్ధిదారుల ఇంటి వద్దనే పింఛన్ల పంపిణీ

మైలవరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో వివిధ రకాల పింఛన్ లబ్ధిదారులకు వారి ఇంటి వద్దనే పింఛన్ పంపిణీ చేయాలని ఎంపీడీవో రామచంద్రారెడ్డి శుక్రవారం తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో 6,392 మంది పింఛన్‌దారులు ఉన్నారని, వారందరికి రూ.6.69 కోట్లు మేర నగదు ప్రభుత్వం అందించనుంది. అలాగే గ్రామాల్లో జరిగే పి4 సర్వేకు ప్రజలందరు సహకరించాలన్నారు.

రేపు ఉచిత గుండె వైద్య శిబిరం

బద్వేలు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మార్చి 2వ తేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటలవరకు ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పట్టణ అభివృద్ధి సొసైటీ అధ్యక్షకార్యదర్శులు నానబాల వెంకటేశ్వర్లు, గురుమూర్తి తెలిపారు. పెద్దిరెడ్డి మాధవరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు చెన్నకృష్ణారెడ్డి, ఆనంద మోహన్‌రెడ్డి ల ఆర్థిక సహాయంతో నెల్లూరు కిమ్స్ ఆసుపత్రిలో పనిచేస్తున్న గుండెవ్యాధి నిపుణులు ఈ శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. అవసరమైన వారు 9966718131, 9494687822,9494450004 నంబర్లను సంప్రదించాలన్నారు.

షెడ్డును ప్రారంభించిన భూపేశ్‌రెడ్డి



జమ్మలమడుగు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని పలగాడి వీదిలో మసీదు ఎదురుగా ఆస్తానయే హజరత్ సయ్యద్ షా రఫీవుల్లాఖాద్రి దర్గా ఆవరణలో వరండా షెడ్డును టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ప్రారంభించారు. ముందుగా ఆయన శుక్రవారం రాత్రి 8 గంటలకు దర్గాలో ప్రత్యేక పాతెహాలు నిర్వహించారు. అనంతరం భూపేశ్‌రెడ్డిని ముస్లిం మత పెద్దలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గోనా పురుషోత్తంరెడ్డి, దేవగుడి యూత్ నాగేశ్వరరెడ్డి, కాటా నవనీశ్వరరెడ్డి, ఎ.రంగనాయకులు, దలాల్‌షబ్బీర్, జి.కె.గైబు, షేక్ దస్తగిరి, నాగూర్, గైబు, కొమెర్ల జాకీర్, షేక్షావలి పాల్గొన్నారు.

లంకమల హుండీ లెక్కింపు

బద్వేలుటౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్యక్షేత్రమైన లంకమల్లలోని ముక్తి రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో హుండీని దేవదాయశాఖ సహాయ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, ఆలయకమిటీ సభ్యుల ఆధ్వర్యంలో లెక్కించారు. తాత్కాలిక హుండీలో రూ.1,66,420, శివపార్వతుల కల్యాణానికి చదివింపులు రూ.3,17,580, దర్శనం టికెట్‌కు సంబంధించి రూ.1,46,600, తలనీలాలకు సంబంధించి రూ.8,400, బంగారు, వెండి నగలకు సంబంధించి సుమారు లక్షరూపాయలు, తలనీలాల ద్వారా రూ.96,500, టెంకాయల వేలం ద్వారా రూ.37,500, రాగా, రికార్డులో నమోదు చేశారు.

చర్మకారులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : చర్మకారులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని లిడ్‌క్యాప్ డైరెక్టర్ గొడుగునూరు రాజశేఖర్ అన్నారు. శుక్రవారం ఆయన పోరుమామిళ్లలో మాట్లాడుతూ మాదిగలు, చర్మకారుల జీవన విధానాన్ని మార్చాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లిడ్‌క్యాప్‌కు రూ.110కోట్ల నిధులు కేటాయించారన్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు కలిగిన నిరుద్యోగ యువతకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు పాలిసెట్‌కు ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జింకా అశోక్‌బాబు తెలిపారు. ఉత్తమ అధ్యాపకులతో ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. ఇతర వివరాలకు పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలని కోరారు.

రాష్ట్రాభివృద్ధికి దిక్సూచి బడ్జెట్

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మొదటిసారిగా ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుందని జనసేన పార్టీ నాయకుడు మాదాసు మురళి తెలిపారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ 3.22 లక్షల కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారన్నారు. వ్యవసాయం, ఆరోగ్యం, విద్య, మహిళా, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమం, విద్యాశాఖ, అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. తల్లికి వందనం పథకానికి నిధులు కేటాయించడం అభినందనీయమనారు. బీసీల సంక్షేమానికి 47,456 కోట్లు కేటాయించారన్నారు.

చెరువులపై నిర్లక్ష్యమెందుకో..?

- చిట్టడవిని తలపిస్తున్న చెరువుల కట్టలు
- మరమ్మతులకు నోచుకోని తూములు
- ఆందోళనలో అన్నదాతలు



ఓబుళాపురం చెరువు కట్టను కప్పేస్తున్న తుమ్మకంప

కాశినాయన ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి):సాగు, తాగునీటికి గ్రామాల్లో చేదోడువాదోడుగా ఉంటున్న చెరువులు నిర్లక్ష్యం నీడలో కొట్టుమిట్టాడుతున్నాయి. కొన్ని చోట్ల కంపచెట్లతో నిండిపోయి చిట్టడవిని తలపిస్తుండగా మరికొన్ని చోట్ల ఆక్రమణలతో కుంచించుకుపోతున్నాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆయకట్టు చెరువులను గాలికి వదలివేయడంతో నిరుపయోగంగా మారాయి. మండలంలోని అమగంపల్లె మొదలుకొని పిట్టిగుంట వరకుఉన్న దాదాపు21 చెరువులు 30 కుంటలు అన్యాక్రాంతంగా మారాయి. ఇప్పటికే చాలా చెరువు కట్టలు చిట్టడవులను తలపిస్తున్నాయి. కుంటల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది. సాదారణంగా ఆయకట్టు చెరువులకు నీరుచేరక ముందే అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తూములకు, కట్టలకు ఏమైనా మరమ్మతులు ఉంటే చేయించాల్సి ఉంటుంది. కానీ అధికారులు చెరువుల దరిదాపులకు కూడా రావడంలేదనే ఆరోపణలున్నాయి. ఓబుళాపురం, పిట్టిగుంట చెరువుల పరిస్థితి మరీ ధారుణంగా ఉంది. దాదాపు కిలోమీటర్ పొడవున్న ఈచెరువుకట్ట మీదుగా ఒకప్పుడు రాత్రనక పగలనక ట్రాక్టర్‌లు, ఎడ్ల బండ్లు, ద్విచక్రవాహనాలు తిరిగేవి. చెరువుకు ఆవల ఉన్న లింగారెడ్డిపల్లె, అక్కసిద్ధుపల్లె, పిడుగుపల్లె తదితర గ్రామాల ప్రజలు విద్యార్థులు ఈచెరువుకట్టపై రాకపోకలు సాగిస్తూ సమీపంలోని చెన్నారెడ్డిపల్లెకు వచ్చి వెళ్లేవారు. నేడు పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. చెరువుకట్టపై ముళ్ళకంప బలంగా అల్లుకొని కట్టలు కుచించుకపోయి బలహీనంగా మారాయి. కట్టపై నడిచివెళ్లాలని ప్రయత్నించినా ముఖాలకు గాయాలు అయ్యే పరిస్థితి. పంట సాగుచేసుకున్నా పండిన పంటను రైతులు, ఎడ్లబండ్లతో,ట్రాక్టర్‌లతో ఇంటికి తోలుకోవాలన్నా వీలుగాని పరిస్థితి నెలకొంది. గత టీడీపీ ప్రభుత్వంలో పిట్టిగుంట చిన్నచెరువుకు తూము కొంతమేర కాలువ పనులు చేపట్టేందుకు నిధులు మంజూరయ్యాయి. అయితే నిధులు సరిపోక తూముకు షట్టరు ఏర్పాటుచేయలేదు. ఆతర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం చెరువులకు చిల్లిగవ్వ ఇవ్వకపోవడంతో వర్షాకాలం చెరువుకు నీరువచ్చినా కాలువలకు వదులుకొని పంటలు పండించుకొనే అవకాశం లేకుండా పోయిందంటుని రైతులు వాపోతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా చెరువులకు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

కనుమరుగు కాకుండా కాపాడాలి

పల్లెల్లో వ్యవసాయానికి ఆయువుపట్టులాంటివి చెరువులు. సాగు తాగునీటికి ప్రదాన వనరులైన చెరువులను ప్రభుత్వాలు పట్టించు కోకపోవడం సమంజసంకాదు. ఇప్పటికైనా బాగు చేయించి కనుమరుగుకాకుండా కాపాడాలి.

-అక్కి.రమణారెడ్డి, మండల ఆదర్శ రైతు

నిధుల కొరతతోనే సమస్యలు

నిధుల కొరతతో గత 5సంవత్సరాల్లో గ్రామీణ ప్రాంతాల్లోని చెరువుల్లో ఏపనులు చేయలేకపోయాం. కొత్త ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు అయిన వెంటనే ప్రస్తుత వేసవికాలంలోనే చెరువులకు అవసరమైన మరమ్మతులు చేపడతాం.

-కొండారెడ్డి, ఇరిగేషన్ ఏఈ

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 15వ తేదీ వరకు పరీక్షలు జరుగనున్నాయి. పరీక్షలకు సంబంధించి ప్రొద్దుటూరు పట్టణంలో 9 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎస్‌సీఎస్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల, భావనా జూనియర్ కళాశాల, అభ్యాస్ జూనియర్ కళాశాల, శ్రీ విద్య జూనియర్ కళాశాల, శ్రీగీతం జూనియర్ కళాశాల, నారాయణ జూనియర్ కళాశాల, శ్రీదీప్తి జూనియర్ కళాశాల, విజ్ఞాన్ బాలికల జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి 12 వరకు పరీక్ష నిర్వహించనున్నారు. అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామని, ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కళాశాలల నిర్వాహకులు పేర్కొన్నారు. శనివారం మొదటి సంవత్సరం విద్యార్థులకు, తెలుగు, సంస్కృతం, ఉర్దూ భాషా పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల సందర్భంగా కళాశాలల వద్ద గట్టి 144వ సెక్షన్ విధించారు. ఇంటర్ పరీక్షలను పటిష్టంగా నిర్వహించడానికి ఇంటర్‌బోర్డు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఎర్రగుంట్లలో: ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులు సమయపాలన పాటిం చాలని ప్రభుత్వ ఇంటర్ కాలేజి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వి.నాగమహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంవిద్యార్థులు 197మంది, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 164మంది ఉన్నట్లు తెలిపారు. చిలమకూరులోని ప్లస్ 2 విద్యార్థులకు కూడా ఇదే సెంటర్‌లో పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారన్ని తెలిపారు.

మైదుకూరు రూరల్‌లో : మైదుకూరులో ఇంటర్ పరీక్షలు కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య నిర్వహిస్తున్నట్లు పరీక్ష నిర్వహణ అధికారి వెంటకసుబ్బయ్య తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో బాలురు 378 మంది, బాలికలు 454 మంది, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో బాలురు 383 మంది, బాలికలు 487 మంది బాలికలు పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్తు స్తంభాల అవినీతిపై విచారణ జరపాలి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని పలు ప్రాంతాల్లో గత మూడు నెలల నుంచి విద్యుత్తు స్తంభాల మార్పులో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలని పలువురు కోరుతున్నారు. పట్టణంలో ఇటీవల 8 చోట్ల ఒరిగిన స్తంభాలు దెబ్బతిన్న స్తంభాలను మార్చినట్లుగా తెలుస్తోంది. జమ్మలమడుగు పట్టణంలోనేకాక గ్రామీణ ప్రాంతాల్లో మరికొన్ని చోట్ల స్తంబాలు మార్పు చేయడంలో ఎస్టిమేషన్ వేసి అందులో కొందరు డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. వాటిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. కాగా ఈ విషయమై జమ్మలమడుగు పట్టణ విద్యుత్తు ఏఈ రజనీకాంత్‌రెడ్డిని వివరణ కోరగా ఆర్డీవో కార్యాలయం వద్ద రోడ్డు పక్కన స్తంభానికి సంబంధించి ఎస్టిమేషన్ వేసి సమస్య వస్తే దానికి సంబంధించిన డబ్బులు వెనక్కు ఇవ్వడం జరిగిందన్నారు. కాంట్రాక్టర్ల వల్లనే సమస్యలు ఉన్నాయని భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా చూస్తానన ఆయన స్పష్టం చేశారు.

ఆప్కాస్‌ను రద్దుచేసే ఆలోచన విరమించుకోండి

బద్వేలు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆప్కాస్‌ను రద్దు చేస్తే ఏజన్సీలు సక్రమంగా జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడతాయని అందువల్ల ఆలోచన విరమించుకోవాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ నేతలు కోరారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికై రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన పిలుపు లో భాగంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జేవి. భవన్‌లో సమావేశం నిర్వహించారు.ప్రభుత్వ సంస్థలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు, ఆయా సంస్థలు ఆప్కాస్‌కు చెల్లిస్తే అక్కడి నుంచి నేరుగా 1న సకాలంలో జీతాలు చెల్లించడం జరుగుతున్నదని, ఆప్కాస్‌ను రద్దు చేస్తే ఏజన్సీలు సక్రమంగా జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టడం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇలాంటి చర్యలకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఇర్ల నాగేష్, మున్సిపల్ వర్కర్స్ ఏఐటీయూసీ నాయకులు నరసింహులు, గురయ్య పాల్గొన్నారు.

పక్షవాతానికి కడపలో అందుబాటులో అత్యాధునిక ఇంజక్షన్

- డాక్టర్ జగదీశ్వర్‌రెడ్డి, న్యూరోవైద్యులు



ఇమాట్లాడుతున్న డాక్టర్ జగదీశ్వర్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్, ఫిబ్రవరి 28 (ఆంధ్ర జ్యోతి): పక్షవాతం వచ్చిన రెండు, మూడు గంటల్లో నివారించేదుకు ఎమర్జెన్సీ ఇంజక్షన్, థ్రాంబోలైసిన్ అందుబాటులో ఉందని ప్రముఖ న్యూరోవైద్యుడు డాక్టర్ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. నగరంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న జగదీష్ న్యూరోకేర్‌లో దీర్ఘకాలిక నొప్పులకు ప్రత్యేక చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, డాక్టర్ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జగదీష్ న్యూరోకేర్ 12వ వార్షికోత్సవం సందర్భంగా డాక్టర్ జగదీష్ మాట్లాడుతూ వార్షికోత్సవం పురస్కరిం చుకొని తమ సిబ్బంది,పారా మెడికల్ సిబ్బంది కలిసి 30 మంది రక్తదానం చేశారన్నారు. ఎమర్జెన్సీ యాక్సిడెంట్ చికిత్స, సిటీస్కాన్, రేడియాలజిస్ట్ వైద్య సేవలు అనంతరం సేవలు అందించడానికి ఐసీవీ స్పెషలిస్ట్ డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ క్రాంతిరెడ్డి, నిపుణులైన వైద్యసిబ్బంది అందుబాటులో ఉన్నారని తెలిపారు.

విద్యార్థులు నూతన ఆవిష్కరణలుపై దృష్టి సారించాలి



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న డీఈవో, ఉపాధ్యాయులు

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని జిల్లా విద్యాశాఖాధికారి వై.షంషుద్దీన్ పేర్కొన్నారు. శుక్రవారం ఎస్వీ డిగ్రీ కళాశాల ఆడి టోరియంలో జాతీయ సైన్స్ దినోత్సవం సీవీ రామన్ సైన్స్‌క్లబ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతికమండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈవో మాట్లాడుతూవిద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలనిసూచించారు. కడప ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి, సంస్కృతిస్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, సైన్స్‌క్లబ్ జిల్లా కన్వీనర్ విజయమోహన్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం ప్రొద్దుటూరు డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 10వ తరగతి విద్యార్థులకు సైన్స్ ప్రతిభ పరీక్ష నిర్వహించి ప్రతిభ కనపరిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు సావిత్రమ్మ, శోభారాణి, వంశీకృష్ణ, సైన్స్‌క్లబ్ కార్యదర్శి అల్లాబకాష్, గోపీనాథరెడ్డి, సుబ్బానాయుడు, మహేశ్వరరెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల సైన్స్‌ప్రాజెక్టు



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న భవానీ, బావనారెడ్డి



ప్రాజెక్టులు తయారు చేసిన విద్యార్థులు

చాపాడు, ఫిబ్రవరి 28 (ఆంధ్ర జ్యోతి): ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూలులో విద్యార్థులు శుక్రవారం ఏర్పాటు చేసిన జాతీయ సైన్స్ ప్రాజెక్టు పలువురిని బాగా ఆకట్టుకుంది. విద్యార్థులు సోలార్‌సిస్టం, టెంట్రావెల్, డైనమిక్ జనరేటర్, సోర్సెస్ ఆఫ్ ఎనర్జీ, వాటర్ అలారం, డ్రిప్ ఇరిగేషన్ వంటి పలు రకాల ప్రాజెక్టులు తయారు చేశారు. ట్రైనింగ్ డీపీలు భవానీ, బావనారెడ్డిలు ఆ ప్రాజెక్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశలో నుంచే ప్రాజెక్టుల ద్వారా విజ్ఞానం పెంపొందించుకోవచ్చన్నారు. కాలానుగుణంగా మన శాస్త్రవేత్తలు కొత్త ఆవిష్కరణలు చేస్తూ దేశంకోసం, ప్రజల కోసం సేవలు చేస్తున్నారన్నారు. కరస్పాండెంట్ జయచంద్రారెడ్డి, డైరెక్టర్ లోహిత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రవీంద్ర కూడా మాట్లాడారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులున్నారు.

కొండాపురంలో: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక వివేకానంద పాఠశాలలో శుక్రవారం సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు. వివిధ అంశాలపై విద్యార్థులు చేసిన సైన్స్ ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. గెలుపొందిన విద్యార్థులకు కరస్పాండెంట్ బి.లింగేశ్వరరెడ్డి బహుమతులను అందజేశారు.

దువ్వూరులో: దువ్వూరులోని షిరిడీసాయి హైస్కూలులో శుక్రవారం జాతీయ సైన్స్‌డే సందర్భంగా విద్యార్థులకు సైన్స్‌కు సంబంధించిన ప్రాజెక్టు పోటీలు నిర్వహించారు. హైస్కూలు పరిధిలో 203 మంది విద్యార్థులు నమూనాలు తయారు చేసి ఉపాధ్యాయుల మన్ననలు పొందారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మస్తాన్, ఏవో నరేష్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో: విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకే విజ్ఞాన కళాప్రదర్శన నిర్వహిస్తున్నారని పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్, వైద్యులు కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. శుక్రవారం పోరుమామిళ్లలోని వైష్ణవి ఇంగ్లీష్‌మీడియం హైస్కూల్లో విజ్ఞాన కళాప్రదర్శనకు విచ్చేసిన వారు విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను తిలకించారు.

ప్రొద్దుటూరు టౌన్‌లో: విద్యార్థులు శాస్త్రీయ వైఖరిని అలవర్చుకోవాలని గౌతమ్ హైస్కూలు కరస్పాండెంట్ పి.సుధీర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు 200 ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎస్‌సీఎస్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ కళాశాల ఉపాధ్యాయులు, పాల్గొన్నారు. వైఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సైన్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జయరామిరెడ్డి మాట్లాడుతూ విజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మోడంపల్లె మున్సిపల్ ఉర్దూ హైస్కూలులో 120 మంది విద్యార్థులు వివిధ నమూనాలను ప్రదర్శించారు.

మైదుకూరు రూరల్‌లో :శాంతి కోసం సైన్స్, ప్రగతి కోసం సైన్స్ అనే నినాదంతో భారతీయులంతా ముందుకు దూసుకెళుతురున్నారని జిల్లా పరిషత్ హైస్కూల్ హెడ్ మాస్టర్ రామ్మోహన్ కొనియాడారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ సైన్స్ నమూనాలను తయారు చేసి ప్రదర్శనలో నిలిపారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు పట్టణంలోని శివాలయం మెయిన్ రోడ్డు నుంచి శ్రీనివాసనగర్‌కు వెళ్లే దారి సమీపాన కాలువ పై ఏర్పాటు చేసిన పైకప్పు భారీ వాహనాల రాకపోకలతో కుంగిపోయింది. దీంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నిత్యం పాదాచారులతో, వాహనాదారులతో రద్దీ ప్రదేశం కావడంతో చిన్నాచితక ప్రమాదాలు పరిపాటిగా మారాయి. అధికారులు వెంటనే స్పందించి భారీ ప్రమాదం జరగకముందే మరమ్మత్తులు చేపట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు. -ప్రొద్దుటూరు అర్బన్, (ఆంధ్రజ్యోతి)

మోసపోయిన అభ్యర్థులకు న్యాయం చేయండి



డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి , పక్కన బాధితులు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో ఉద్యోగాల పేరుతో మోసపోయిన అభ్యర్థులకు న్యాయం చేసి మోసం చేసిన ఏజెంట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ డిమాండ్ చేశారు. శుక్ర వారం అభ్యర్థులతో కలిసి జమ్మలమడుగులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ హయాంలో సీసీడీవో పోస్టుల పేరుతో జూనియర్ కళాశాలలు, మోడల్ కళాశాలలో ఉద్యోగాలు అని చెప్పి కడపకు చెందిన ఆది రవికుమార్ అనే ఏజెంట్ ఒక్కొక్కరి దగ్గరి నుంచి రూ.4 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు వసూలు చేసినట్లు తెలిపారు. ఆమేరకు బాదితులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. జిల్లాలో మోసపోయిన బాధితులు సుమారు 21 మంది ఉన్నారన్నారు. అభ్యర్థులు కొందరు జూనియర్ కళాశాలలో చేరిన తర్వాత అధికారులు తనిఖీలు చేసి ఫేక్ ఉద్యోగాలు అని చెప్పడంతో మోసపోయినట్లు తెలిపారు. ఆ ఏజెంట్‌కు తమ డబ్బులు వెనక్కు ఇవ్వమని నెలల కొద్ది తిరుగుతున్నా పట్టించుకోక వారినే బెదిరిస్తున్నారని ఈ సందర్భంగా బాధితులు తెలిపారు. కడప జిల్లాలోనే కోటిరూపాయలకుపైగా స్కాం జరిగిందన్నారు. మోసపోయిన బాదితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మోసపోయిన బాధితులున్నారు.

తిమ్మాపురంలో కందుల కొనుగోలు కేంద్రం



నమూనా కందులను పరిశీలిస్తున్న అధికారులు

ముద్దనూరు ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి):మండల పరిధి తిమ్మాపురం గ్రామంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు, రైతులు కందులు అమ్మకానికి రిజిస్టర్ చేసుకోవాలని ఏవో వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. కందుల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఏవో పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల కోసం మద్దతు ధరతో కందులు కొనుగోలు చేస్తున్నదన్నారు. ఇప్పటి వరకు 20 మంది రైతులు కందులు అమ్మకానికి నమూనాలు తీసుకొని వచ్చి రిజిస్టర్ చేయించుకొన్నారన్నారు.ముద్దనూరు, ఎర్రగుంట్ల, కొండాపురం మండలాల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌంటర్ నిర్వాహకులు నారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వం టైలర్లను అన్ని విధాల ఆదుకోవాలి



ఎర్రగుంట్లలో టైలర్స్ డేని జరుపుకుంటున్న దృశ్యం

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రెడిమేడ్ దుస్తుల వల్ల టైలర్స్‌కు రోజు రోజుకు ఉపాధి కరువవుతోందని దీని వల్ల ప్రభుత్వం ఉపాధి కల్పించి టైలర్స్‌ను అన్ని విధాల ఆదుకోవాలని సంఘం నేతలు కోరారు. శుక్రవారం ఎర్రగుంట్లలో టైలర్స్ డేని నిర్వహించారు. నాలుగురోడ్ల కూడలిలో ఉన్న పెద్దన మాత్యుల విగ్రహానికి పూలమాలవేసి, టెంకాయ కొట్టి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా టైలర్స్ సంఘం నాయకులు మాట్లాడుతూ పండుగల సందర్భంలో తప్ప మిగతా రోజుల్లో టైలర్లకు ఉపాధిలేకుండా పోతోందన్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకుని టైలర్స్ మనుగడకు జీవంపోయాలన్నారు. సబ్సిడీల్లో జిగ్‌జాగ్, కుట్టు మిషన్లు పంపిణీ చేయడంతోపాటు టైలర్స్ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో వీరాంజనేయులు, శివ, రఘురామిరెడ్డి, మాబు, బ్రహ్మం, నన్నే, రవి, కాశీం, ప్రతాప్, సుబ్బారెడ్డి, రియాజ్, రాధాక్రిష్ణ పాల్గొన్నారు.

ఖాజీపేటలో:మండల పరిదిలోని భూమాయపల్లె సమీపంలోగల అమ్మ అనాథ శరణాలయంతో టైలర్స్‌డే సందర్భంగా అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల టైలర్స్ తదితరులు పాల్గొన్నారు.



టైలర్ సుధాను సన్మానిస్తున్న దృశ్యం

మైదుకూరు రూరల్‌లో :స్థానిక సాయిబాబా క్లాత్ మార్కెట్‌లో టైలర్స్ డే సందర్భంగా సుమారు 40 సంవత్సరాలుగా టైలర్ వృత్తిలో కొనసాగుతున్న సుధాకర్‌ను వాసవీక్లబ్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ రీజనల్ చైర్మన్ సుబ్బారాజు, జిల్లా ట్రెజరర్ పబ్బతి గోపాల్, జోన్ చైర్మన్ వంకదార రవిప్రసాద్, వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ సురేంద్ర, ప్రసాద్, కుప్పం కిషోర్, యలవలి గోపి, వందవాసి నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల కారణంతో మైలవరం దారి మూసివేత

జమ్మలమడుగు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయానికి వెళ్లే రోడ్డు పనులు జరుగనున్నందున పర్యాటక కేంద్రమైన గండికోటకు వెళ్లే ప్రధాన రోడ్డు మూసివేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం గండికోటకు వచ్చిన పర్యాటకులు బోటు షికారుకోసం మైలవరం జలాశయం వైపు వెళ్లాల్సి ఉన్నా మైలవరం గేట్ల వద్ద స్విల్వే మరమ్మతుల నిమిత్తం కట్టపై రాకపోకలు తాత్కాలింగా నిషేధించినట్లు మైలవరం ప్రాజెక్టు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. పర్యాటకులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

సుందరయ్యనగర్‌లో రోడ్లు వేయాలి



పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున సీపీఎం నాయకులు

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్ర జ్యోతి): మండల పరిదిలోని కొత్తపల్లె పంచాయతీలో ఉన్న సుందరయ్య నగర్‌లో సిమెంటు రోడ్లను ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం కొత్తపల్లె పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుందరయ్య నగర్ కాలనీ ఏర్పడి దాదాపు 14 సంవత్సరాలు అవుతున్నా సరైన రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్, మహిళా సంఘ నాయకురాళ్లు రాములమ్మ, చెన్నమ్మ, లాల్‌బీ, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

నివాసం ఉంటున్న పేదలకే ఇంటిపట్టాలు ఇవ్వాలి

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : బాకరాపేట సమీపంలో గత 10 నెలలుగా గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పేదలకే ఇంటిపట్టాలు మంజూరు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పడిగె వెంకటరమణ కోరారు. సీపీఐ కాలనీ వాసులు చేపట్టిన దీక్షలు శుక్రవారానికి 8వ రోజుకు చేరుకున్నాయి. కార్యక్రమంలో రూరల్ కార్యదర్శి ఇమ్మానియేలు దీక్షల్లో విజయకుమారి, దేవి, స్వప్న, సుబ్బారెడ్డి, రాశేఖర్, వెంకటేష్, ప్రసాద్, గుడిసె వాసులు పాల్గొన్నారు.